


'సంక్షేమ' జల్లు!

- రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో వివిధ వర్గాలపై వరాల జల్లు
- మహిళలు, నాయీబ్రాహ్మణులు, చేనేత, కల్లుగీత కార్మికులకు బొనాంజా
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై పూర్తిస్థాయి స్పష్టత
- సెలూన్లకు ఉచిత విద్యుత్ 200 యూనిట్లకు పెంపుతో హర్షం
- చేనేత కార్మికులకు ఒకేసారి ఉచిత విద్యుత్, జీఎస్టీ చెల్లింపు, త్రిఫ్ట్ పథకాలు
- అటు కొత్త బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11వరకు తెరుచుకునే ఛాన్స్

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పలు కీలక నిర్ణయాలు ప్రకటించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు బడుగు, బలహీనవర్గాలకు ఆర్థికంగా మరింత తోడ్పాటునందించేలా వరాల జల్లు కురిపించింది. మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, నాయీబ్రాహ్మణులు ఇలా అనేక వర్గాలకు ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలను ప్రకటించింది. తద్వారా ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన అనేక హామీలు అమలుచేసేలా క్యాబినెట్ నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా ఆగస్టు 15 నుంచి అమలుకానున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై మంత్రి మండలి పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చింది. మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడకు ఏయే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చనేదానిపై కీలక నిర్ణయాలు ప్రకటించింది. రాష్ట్రానికి చెందిన మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రకటించింది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణానికి ప్రభుత్వం అనుమతించింది. ఉచిత సౌకర్యం వినియోగించుకునేందుకు ఆధార్, ఓటర్, రేషన్‌కార్డుల్లో ఏదొకటి చూపిస్తే చాలని స్పష్టత ఇచ్చింది. అలాగే ఉచిత బస్సు పథకం నాన్‌స్టాప్, అంతర్ రాష్ట్రీయ బస్సు సర్వీసులు, లేదా ఇతర ఏ కేటగిరీలకు వర్తించదని పేర్కొంది. పథకం అమలుకు నెలకు రాష్ట్రవ్యాప్తంగా రూ.162 కోట్ల వరకు ఖర్చవుతుండగా, ఉమ్మడి జిల్లాలో రూ.16 కోట్ల వరకు ప్రభుత్వంపై భారం పడనుంది. మరోపక్క ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రద్దీ పెరగనున్నందున మహిళల భద్రత కోసం బస్సు లోపల సీసీ కెమెరాలు, మహిళా కండక్టర్లకు బాడీ వార్న్ కెమెరాలు ఇవ్వనున్నట్టు క్యాబినెట్ వెల్లడించింది. అందులో భాగంగా పథకం అమలుకోసం ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో దాదాపు 600 బస్సులను సిద్ధం చేస్తున్నారు. అలాగే అన్ని బస్సు డిపోల్లో ప్రయాణికుల కోసం ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం కూడా కల్పించడానికి క్యాబినెట్ నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో అనేక బస్టాండ్ల రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం హెయిర్ కటింగ్ సెలూన్లకు అమలవుతున్న 150 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు అయితే ప్రభుత్వం బొనాంజా ప్రకటించింది. ఒకేసారి మూడు పథకాలకు ఆమోదం తెలిపింది. మగ్గాలకు ఉచిత విద్యుత్, చేనేత విక్రయాలపై జీఎస్టీ రద్దు, త్రిఫ్ట్ ఫండ్ పథకం ప్రారంభించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ వల్ల ఉమ్మడి జిల్లాలో 6,548మందికి రూ.3.92కోట్ల లబ్ధిచేకూరనుంది. అలాగే చేనేత ఉత్పత్తులపై చెల్లించే జీఎస్టీని ప్రభుత్వం నేతన్నలకు తిరిగి చెల్లించాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం నేతన్నల్లో సంతోషం మిన్నంటేలా చేస్తోంది. దీంతో కాకినాడ జిల్లాలో 23 సంఘాలకు రూ.12 లక్షలు, కోనసీమ, తూ.గో జిల్లాల్లో నేతన్నలకు రూ.75లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ఇక ఈనెలతో ముగియనున్న పాత బార్ లైసెన్సుల నేపథ్యంలో వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభం కానున్న కొత్త బార్లకు సంబంధించి విధివిధానాలను క్యాబినెట్ వెల్లడించింది. కొత్త బార్లు ఇకపై ఉదయం పది నుంచి రాత్రి 11వరకు తెరవడానికి అనుమతించింది. అలాగే కల్లుగీత కార్మికులకు బార్ ఫీజులో యాభై శాతం తగ్గింపుతో కల్లుగీత కార్మికులకు తీపి కబురు అందించింది.






ఎరుపెక్కిన రాజమహేంద్రి

సుబ్రహ్మణ్య మైదానంలో సీపీఐ జిల్లా 26వ మహాసభలు ప్రారంభం

హాజరైన రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

6

రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన సీపీఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ.. హాజరైన జనం



కదలరు.. వదలరు

- పోలవరంలో ఏళ్ల తరబడి ఆ ఇంజనీర్లే తిష్ట
- అదే ప్రాజెక్టులో వేరే డివిజన్‌కు బదిలీ అయినా పని జరిగే డివిజన్‌లోకి చొరబాటు
- ప్రస్తుతం డయాఫ్రంవాల్, ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులకే డిమాండ్
- పోలవరం ప్రాజెక్టులో 8 డివిజన్లు
- కొన్ని డివిజన్లలో ఈగల మోతే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్టాత్మకమైన పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టులో మొదట నుంచి కొందరు అధికారులే తిష్టవేశారనే విమర్శలు వస్తున్నాయి. కొందరు ఇంజనీర్లు ఆయా కాంట్రాక్టు కంపెనీలు, ప్రజాప్రతినిధులతో సిండికేట్‌గా మారి ఏదో విధంగా ఇదే ప్రాజెక్టులో పని జరిగే డివిజన్‌లోనే ఉండేటట్టు చేసుకోవడం పలు విమర్శలకు తావిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరించిన అధికారులు ఇక్కడ పని చేస్తుండడం గమనార్హం. కొందరికి పదోన్నతులు వచ్చాయి. పలువురు ఇక్కడి నుంచి వేరే డివి జన్‌కు బదిలీ అయినా కూడా డైవర్షన్ పేరుతో తిరిగి పనిజరిగే డివిజన్‌లోనే పనిచేయడం గమనార్హం. కొద్దినెలల ముందు జరిగిన బదిలీల్లో ఐదేళ్లు నిండకుండానే సుమారు 10 మంది ఏఈలను ప్రాధాన్యత లేని డివిజన్లకు పంపించి, పాతవారే కొందరు రావడం గమనార్హం. మరో ముగ్గురు వేరేచోటకు బదిలీ అయి కూడా డైవర్షన్ మీద ఇక్కడే పని చేస్తున్నారు. ఒకాయన ఎక్కువ కాలం పనిచేసి మళ్లీ ఇక్కడి క్వాలిటీ కంట్రోలు ఈఈగా రావాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇటీవల కొందరు జలవనరుల శాఖ ఉన్నతాధికారికి వివరంగా ఒక లేఖ రాసినట్టు సమాచారం. పోలవరం ప్రాజెక్టులో మొత్తం 8 డివిజన్లు ఉన్నాయి. 1వ డివిజన్‌లో స్పిల్‌వే కన్‌స్ట్రక్షన్, 2వ డివిజన్‌లో కుడి ప్రధాన కాలువ కనెక్టివిటీ అంటే పోలవరం ప్రాజెక్టుకు కుడిప్రధాన కాలువ(ఆర్‌ఎంసీ)ని కలపడం. కొండలు తొలిచి, టన్నెళ్లు వంటివి నిర్మించి ప్రాజెక్టుతో కాలువను అనుసంధానం చేయడం ఈ డివిజన్‌లోని ఇంజనీర్ల పని. మూడో డివిజన్‌లో అతి ముఖ్యమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్(ఈసీఆర్ఎఫ్). ఇక్కడే డయాఫ్రంవాల్, గైడ్ బండ్ వంటి పనులు ఉంటాయి. మొత్తం ఈ పనులనే ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1, గ్యాప్-2 అంటారు. నాల్గో డివిజన్‌లో స్పిల్‌వే 48 గేట్లు బిగించడం, వాటి పర్యవేక్షణ ఉంటుంది. 5వ డివిజన్‌లో ఎడమ ప్రధాన కాలువ(ఎల్‌ఎంసి) కనెక్టివిటీ పనులు ఉన్నాయి. 6వ డివిజన్‌లో పవర్ హౌస్ నిర్మాణం ఉంది. మట్టి పనులు వరకూ ఇరిగేషన్ ఇంజనీర్లు చేశారు. ప్రస్తుతం జెన్‌కో పని ఉంది. ఇక్కడ కూడా తక్కువ పని ఉన్నట్టే లెక్క. 7, 8 డివిజన్లలో భూసేకరణ పనులు ఉన్నాయి. ఇవి కాకుండా క్వాలిటీ కంట్రోలు డివిజన్‌లో ప్రత్యేకంగా ఉంటుంది. ఇది ధవళేశ్వరంలో ఉంటుంది. దీని పరిధిలో సబ్ - డివిజన్లు కూడా ఉంటాయి. తెలివైన, పట్టు ఉన్న అధికారులంతా పని ఉన్న డివిజన్లతో పాటు క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో పని చేయడానికి మోజు పడుతుంటారు. దీని పరమార్థం అందరికీ తెలిసిందే. మొదటి దశకు సంబంధించిన సుమారుగా భూసేకరణ పూర్తయింది. ఒక్కో డివిజన్‌లో ఈఈ. పలువురు డీఈలు, ఏఈలు ఉంటారు. ఇక ఇప్పటికే 1వ డివిజన్‌లో స్పిల్‌వే పనులు పూర్తయ్యాయి. 2వ డివిజన్ పనులు సుమారుగా పూర్తయ్యాయి. మూడో డివిజన్‌లోనే అతి ముఖ్యమైన ఈసీఆర్ఎఫ్ (డయాఫ్రంవాల్ నిర్మించి, దానిమీద ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మిస్తారు). 4వ డివిజన్‌లో పోలవరం ప్రాజెక్ట్ (పీపీఏ) భవనం నిర్మాణం ఒకటి జరుగుతుంది. మిగతా పనులన్నీ పూర్తయినట్టే. 5వ డివిజన్‌లో పనులు ఇప్పుడే మొదలయ్యాయి. ప్రస్తుతం డిమాండ్ అంతా 3వ డివిజన్ తర్వాత కొద్దిగా 5వ డివిజన్ మీదే ఉంది. చాలాకాలం నుంచి తిష్టవేసిన అధికారులు మళ్లీ డివిజన్లలోకి రావడం గమనార్హం. కొందరు ఐదేళ్ల తర్వాత బదిలీ అయి, ఉన్నతాధికారులు లేదా, కాంట్రాక్టు ఏజన్సీతో సన్నిహితంగా ఉంటూ డైవర్షన్ మీద ఎక్కువ పనిఉన్న డివిజన్‌కు వచ్చేశారు. ప్రస్తుతం భూసేకరణకు సంబంధించిన 7,8 డివిజన్లలో అధికారులంతా ఇంచుమించు ఖాళీగా ఉన్నారు. ప్రస్తుతం ఈసీఆర్ఎఫ్ గ్యాప్ పనుల్లో పాత ఇంజనీర్లే ఎక్కువ మంది ఉండడం గమనార్హం. క్వాలిటీ కంట్రోలులో ఈఈగా ఉన్న ఓ ఇంజనీరుకు ఇటీవల హైదరాబాద్‌లోని కేఆర్ఎంబీకి బదిలీ అయింది. ఆయన స్థానంలో రావడానికి 4వ డివిజన్‌లో పనిచేస్తున్న ప్రేమ్‌చంద్ అనే ఇంజనీరు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈయన సుమారు 16 ఏళ్లపాటు వివిధ డివిజన్లలోనే తిరుగున్నట్టు ఆరోపణ ఉంది. డీఈఈ కె. శివప్రసాద్ 10 ఏళ్ల నుంచి, ఈఈ కె.సుబ్రహ్మణ్యం 12 ఏళ్ల నుంచి, ఏఈఈ ఎ.అరుణ్‌మహేంద్ర 12 ఏళ్ల నుంచి ఏఈఈ ఏవీకేడీఎస్ స్వామి పదేళ్ల నుంచి, జీవి దుర్గా ప్రసాద్ పదేళ్ల నుంచి ఈ ప్రాజెక్టులోనే ఉన్నట్టు విమర్శలు ఉన్నాయి. ఈఈ డి.శ్రీనివాస్ సుమారు 16 ఏళ్లుగా ప్రాజెక్టు పరిధిలోనే చక్కర్లు కొడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఎస్ఈ నుంచి ఈఎన్‌సీ స్థాయికి ఎదిగిన ఓ అధికారి వైసీపీ హయాంలో గోదావరిలో డ్రెడ్జింగ్ కాంట్రాక్టు అర్హత లేని కంపెనీకి అప్పగించడంతో కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.



పుష్కర రైల్వే పనులు మొదలు

- ద.మ. రైల్వే జీఎం శ్రీవాస్తవ
- రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్ల పరిశీలన
- గోదావరి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నిడివి పొడిగించే యోచన

6

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ : కలెక్టర్

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం సిటీ 50 అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా బుధవారం కలెక్టర్ ప్రశాంతి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాజమహేంద్రవరం సిటీ పరిధిలో ప్రస్తుతం 241 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని, హేతుబద్ధీకరణలో భాగంగా వాటిని పరిశీలించి 5 కేంద్రాల ప్రదేశ మార్పు, 22 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, 62 కేంద్రాల విలీనం లేదా తొలగింపు వంటి మార్పులు చేపట్టామన్నారు. మొత్తం 263 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామన్నారు. కలెక్టర్ వెంట అర్బన్ తహశీల్దారు పాపారావు పాల్గొన్నారు.



అకిరా మియావాకీ పద్ధతిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అకిరా మియావాకీతో అడవులను సృష్టించవచ్చు

కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అకిరా మియావాకీ పద్ధతితో తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచడంతోపాటు దట్టమైన చిట్టడవులను సృష్టించవచ్చని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం చెంతన 25 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన అకిరా మియావాకి మొక్కల పెంపకం ప్రదేశాన్ని, పామ్ పాంట్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అకిరా మియావాకి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా అకిరా మియావాకి మొక్కల పెంపకం ఒక వినూత్న ఆలోచనా మార్గమన్నారు. సరైన వాతావరణంలో మొక్కల పెంపకం చేపట్టడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. రాజానగరం ప్రాంతంలో మొక్కల ఎదుగుదల తీరును పరిశీలించి సంతృప్తివ్యక్తం చేశారు. నీటి నిల్వల సామర్థ్యం పెంచేలా పామ్ పాంట్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అలాగే లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానం అమల్లోనూ మరింత సమర్థతను తీసుకురావాలన్నారు. పరిధిని పెంచి నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని అధికారులకు సూచించారు. పొలం గట్ల మీద కూడా మొక్కల పెంపకం కోసం దృష్టి పెట్టాలన్నారు. మియావాకి పద్ధతిలో మొత్తం 2,970 మొక్కలు నాటడం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నాటిన మొక్కల్లో జామి, వెంగం, బిల్లా, మర్రి, నర్ర, గిలగిల,వద్ది చెట్టు, తామర, మందార, దేవదారు, తులసి, వేప, గంధ తగర వంటి వివిధ రకాల మొక్కలు ఉన్నాయి. ఈ సందర్భంగా సందర్శకుల రిజిస్టర్‌లో క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది పనితీరును ప్రశంసిస్తూ వివరాలను కలెక్టర్ స్వయంగా నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవి, డ్వామా ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో నేరపూరిత పనులు

మయన్మార్ నుంచి యువకుడిని క్షేమంగా రప్పించిన పోలీసులు



యువకుడిని సత్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం ఏడారి దేశం వెళ్లాడు. తీరా అక్కడికి వెళ్లాక తెలిసింది.. అది సైబర్ నేరాలు చేసే కొలువని. ఆరు పదుల జీతం.. దోపిడీ సొమ్ములో పది శాతం వాటా. కానీ ఆ యువకుడికి మనస్కరించలేదు. చట్టాన్ని ఉల్లంఘిస్తున్నామని ఆవేదన చెందాడు. ఇదే విషయాన్ని ఇక్కడ ఉన్న ఆమె తల్లికి చెప్పగా.. ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు.. అతడిని సురక్షితంగా భారత్‌కి రప్పించారు. అక్రమంగా వచ్చే సంపాదనను వద్దనుకొని నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన ఆ యువకుడిని ఎస్పీ సత్కరించారు. పెరవలి మండలం కానూరుకు చెందిన శ్యామ్ కుమార్ మెకానికల్ డిప్లొమా చదువుకున్నాడు. ఉద్యోగం లేకపోవడం, ఇల్లు గడవకపోవడంతో గల్ఫ్ వెళ్లాలని అనుకున్నాడు. ఒక ఏజెంటుకు రూ.లక్ష చెల్లించి రెండు నెలల కిందట బహ్రెయిన్ తీసుకెళ్లాడు. అక్కడ కొద్ది రోజులు గడిచాక అంతర్జాతీయ సరిహద్దును అక్రమంగా దాటించి కారులో మయన్మార్ తీసుకెళ్లారు. అతడు చేయాల్సిన ఉద్యోగాన్ని అక్కడ వివరించారు. సైబర్ నేరాలే వ్యాపారంగా చైనీయులు నెలకొల్పి నడుపుతున్న కంపెనీలు అక్కడ విచ్చలవిడిగా ఉంటాయి. వాటిలోని ఓ కంపెనీలో శ్యామ్‌ను జాయిన్ చేశారు. పాస్‌పోర్టును తీసేసుకున్నారు. భారత్ నుంచి అమెరికా వెళ్లి స్థిరపడి, గ్రీన్‌కార్డు కలిగిన వ్యక్తులతో పరిచయం చేసుకొని వివరాలను సేకరించడం ఉద్యోగం. ఆ వివరాలను కంపెనీ వాళ్లకు ఇస్తే సైబర్ నేరం ద్వారా డబ్బును దోపిడీ చేస్తారు. రూ.60 వేల (భారత కరెన్సీలో) జీతంతోపాటు దోపిడీ సొమ్ములో వాటా కూడా ఇస్తారు. నెలకు ఇంత మంది అని లక్ష్యాలను విధిస్తారు. దీని కోసం ఫేక్‌ఫొటో, వివరాలతో శ్యామ్‌కు ఇన్‌స్టా తదితర ప్లాట్‌ఫాంలలో ఖాతాలు తెరుస్తారు. అయితే ఇదంతా నేరమని, తనను భారత్‌కి పంపించేయాలని ఏజెంట్లకు చెప్పగా.. రూ.4 లక్షలు చెల్లిస్తే పంపిస్తామన్నారు. అదే విషయం ఇక్కడ ఉన్న తల్లితో చెప్పడంతో అప్పుడు చేసి రూ.2.50 లక్షలు పంపించారు. ఇంకా డబ్బు పంపాలని డిమాండ్ చేయడంతో ఆమె ఎస్పీ కార్యాలయంలో రెండు వారాల కిందట పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాలతో నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ ఆ కంపెనీ ప్రతినిధులు, ఏజెంటుతో చాకచక్యంగా మాట్లాడితే శ్యామ్‌ని పంపడానికి ఒప్పుకున్నారు. ఆ మేరకు భారత్‌కి చేరుకున్నాడు. తనకు మాదిరిగానే ఎందరో ఆ కూపంలో చిక్కుకొని, ఇంటికి వద్దామంటే అప్పులు కంటి ముందు కనబడి రోజూ ఏడుస్తూ బతుకుతున్నారని శ్యామ్ చెబుతున్నాడు. టూరిస్టు తదితర స్వల్పకాలిక పరిమితి వీసాలపై తీసుకెళ్లి గడువు ముగిసినా పంపించకుండా ఉద్యోగం చేయించుకుంటున్నారని తెలిపాడు. ఎందరో ఈ ఊబిలో చిక్కుతున్నారని, కేంద్రం దృష్టి సారిస్తే సైబర్ నేరాలు కూడా తగ్గుతాయంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఎస్పీ ఆదేశించారు.





రాజమహేంద్రవరంలో తయారవుతున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు

వినరే గణేశా!

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో హాని
- ఇప్పటికే టన్నుల పీఓపీతో వందలాది వినాయకుడి విగ్రహాలు సిద్ధం
- పశ్చిమబెంగాల్ కార్మికులతో ఇక్కడ తయారీ
- ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం.. పీఓపీ సంగతేంటి?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

భస్మాసురుడు తన నెత్తిపై తానే చెయ్యి పెట్టుకొని భస్మమైపోయినట్టు.. మరీ అంత కాకపోయినా.. నెమ్మదిగా మనకు మనమే నాశనమైపోయే పనులను మాత్రం వీడడం లేదు. ముఖ్యంగా పండుగల మాటున కాలుష్యాన్ని కోరి మరీ కొనుక్కొని తెచ్చుకొని పదిమందికి రోగాలు పంచుతున్నాం. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయకుడి ప్రతిమలు ప్రతి ఏడాది జల కాలుష్యానికి కారణమవుతూనే ఉన్నాయి. ఈనెల 27న వినాయక చవితి సందర్భంగా ఇప్పటికే టన్నుల పీఓపీతో వందలాది విగ్రహాలను తయారు చేసేస్తున్నారు. అసలే ప్రమాదకరమైన పని చేస్తున్నారంటూ పర్యావరణవేత్తలు గోల పెడుతున్నా.. ఒకరిని మించి మరొకరు భారీ విగ్రహాలను మండపాల్లో కొలువు దీరుస్తున్నారు. ఈ ఏడాది కూడా ఉమ్మడి జిల్లాలో వేగంగా భారీ విగ్రహాల తయారీ జరుగుతోంది.

పీఓపీతో ప్రమాదం

పీఓపీ నీటిలో కరగదు. మట్టిలో కలవదు. అగ్గిలో దహనం కాదు. నీటిని కలుషితం చేస్తుంది. ప్రవాహానికి అడ్డుగా నిలుస్తుంది. దీంతో నీటిలోని జీవవైవిధ్యం దెబ్బతింటుంది. విగ్రహాల తయారీకి ఉపయోగించే పీఓపీ(కాల్షియం సల్ఫేట్ హెమీహైడ్రేట్) విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల ఆ నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోతుంది. పీఓపీలో ప్రధానంగా జిప్సంని ముడి పదార్థంగా వాడతారు. ఇది ప్రమాదకర రసాయం. ఇలా పీఓపీ కలిసిన నీటిని ఉపయోగించే మనుషులు, పశువులు డయేరియా, కడుపు నొప్పి, చర్మవాధుల బారినపడతారు. క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆర్సెనిక్ వల్ల జుట్టు రాలిపోతుంది. సీసం వల్ల శరీరం పటుత్వం తప్పుతుంది. ఈ నీళ్ల పొలాలకు వెళ్లడం వల్ల భూసారం తగ్గి భూమి సహజ స్వభావాన్ని కోల్పోతుంది. జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశాలతో 2016లోనే పలు రాష్ట్రాలు పీఓపీ విగ్రహాల తయారీపై నిషేధం విధించాయి. కానీ సరైన అవగాహన తీసుకురావడంతో యంత్రాంగం చతికిల బడడంతో ప్రతి ఏటా వేలల్లో విగ్రహాలు తయారు అవుతూనే ఉన్నాయి. కాలుష్య నియంత్రణ మండలి ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో చాలా వెనుకబడి ఉంది.

గత ఏడాది 15వేల విగ్రహాలు

ప్రతి ఏడాది వినాయక చవితి వస్తూండడంతోనే.. సహజ రంగులతో తయారు చేసే మట్టి వినాయకుడి విగ్రహాలనే వినియోగించి పర్యావరణ హితవుకు పాటుబడాలని ఎంత చెప్పినా ఫలితం శూన్యంగా కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి విగ్రహాల తయారీదారులను స్థానిక కాంట్రాక్టర్లు తీసుకొచ్చి మరీ తయారు చేయిస్తున్నారు. అడుగు నుంచి 10 అడుగులపై వరకూ విగ్రహాలను తయారు చేస్తున్నారు. విగ్రహాలను కచ్చితంగా నిమజ్జనం చేస్తారు. దీంతో జల వనరులు కలుషితం అవుతున్నాయి. ఇలా ప్రతి ఏడాదీ ఒక తంతుగా జరిగిపోతోంది. నీటిని కలుషితం చేయడం చట్ట ప్రకారం నేరమే అయినా కాలుష్య నియంత్రణ మండలి పట్టించుకోదు. గతేడాది తూర్పు గోదావరి 1760 వినాయక ఉత్సవ కమిటీలు పోలీసుల వద్ద నమోదు చేసుకున్నాయి. రికార్డులకు ఎక్కనివి వేలల్లో ఉంటాయన్నది తెలిసిందే.

● చైతన్యం తీసుకురావాలి

పీఓపీతో తయారు చేసిన ప్రతిమలను పూజించడం వరకూ ఎలా ఉన్నా.. నీటిలో నిమజ్జనం చేయడం వల్ల కలిగే దుష్పరిమాణాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం తక్షణ అవసరం. జిల్లాలో ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం నిలిపివేతపై కలెక్టర్ ప్రశాంతి పర్యవేక్షణలో ఉద్యమమే నడుస్తోంది. ఆ స్ఫూర్తి పీఓపీపై కూడా ఉండాల్సిన అవసరం ఉంది. మరోవైపు కోర్టులు సైతం పీఓపీ విగ్రహాలను జల వనరుల్లో నిమజ్జనం చేయడంపై కన్నెర్ర చేస్తున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను కృత్రిమంగా ఏర్పాటుచేసే ట్యాంకుల్లోనే నిమజ్జనం చేయాలని బాంబే హైకోర్టు గత నెల 24న ఆదేశించింది. పీఓపీ విగ్రహాలను వీడి మట్టి వినాయకుడిని పూజించే విధంగా యంత్రాంగం దృష్టి పెట్టాల్సి ఉంది.

చేనేతలపై కూటమి ప్రభుత్వం వరాల జల్లు

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నేతన్నలపై వరాల జల్లు కురిపించింది. చేనేత మగ్గానికి 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ప్రకటించింది. నేత వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీని ప్రభుత్వమే భరించాలని రాష్ట్ర సచివాలయంలో చేనేత శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో ప్రకటించారు. దానికి తోడు కేంద్ర ప్రభుత్వం నేత కార్మికుల కోసం అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయల త్రిఫ్ట్ ఫండ్ నిధులను చేనేత కార్మికులకు అందించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై నేత కార్మికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను పునరుద్ధరిస్తే చేనేత రంగం పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని నాయకులు చెప్తున్నారు. నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

నేతన్నల ఇంట విద్యుత్ వెలుగులు

కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. దాంతో నేతన్నల ఇంట ఉచిత విద్యుత్ వెలుగులు ప్రసరించనున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 54 చేనేత సహకార సంఘాల పరిధిలో 9745 మంది సభ్యులు ఉన్నారు. చంద్రబాబు ప్రభుత్వం చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించనుంది. 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్‌ను వినియోగించే కుటుంబాలకు సైతం వెసులుబాటు కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో 6,545 మందికి రూ.3.29 కోట్ల ఉచిత విద్యుత్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 6,548 మంది చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందించేందుకు చేనేత, జౌళి శాఖ అధికారులు గుర్తించారు. వీరికి రూ.3.92 కోట్ల విలువైన ఉచిత విద్యుత్ అందించనున్నారు.



చేనేత వస్త్ర ధారణలో విదేశీ వనిత

రంగు రంగుల దారాలతో అద్భుత కళాఖండాలను అల్లుతూ చేనేత రంగాన్ని నిత్య నూతనంగా ఉంచేందుకు నేతన్నలు నిరంతరం శ్రమిస్తున్నారు. అపార ప్రతిభ, నైపుణ్యం నేతన్నల సొంతం. అగ్గిపెట్టెలో



పట్టేటంత చీరను నేసింది.. అతుకులు లేకుండా జాతీయ పతాకాన్ని తయారు చేసింది, దేవతామూర్తులను సైతం చేనేత వస్త్రాలపై ఆవిష్కరించిన ఘనత నేత కార్మికులదే. అటువంటి చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది.





చేనేత చీర కట్టులో విద్యార్థిని

చేనేత సొబగులు

దారాలతో కళాఖండాల సృష్టి నేతన్నల సొంతం

చేనేత రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు నడుంబిగించిన రాష్ట్ర ప్రభుత్వం



నేడు జాతీయ చేనేత దినోత్సవం

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

నేత కార్మికుల సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించేందుకు 2015 సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రకటించారు. అప్పటి నుంచి ప్రతిఏటా ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నాం. తొలుత చేనేత వస్త్రాలనే ఉద్యమానికి వారధిగా వినియోగించి విదేశీ వస్తువుల బహిష్కరణ ఉద్యమాన్ని బ్రిటీషు ప్రభుత్వ హయాంలో చేపట్టారు. అందుకే 119 ఏళ్ల క్రితం జరిగిన స్వదేశీ ఉద్యమానికి ప్రతీకగా అటువంటి చారిత్రక సందర్భాన్ని జాతీయ చేనేత దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

రాయితీ బకాయిల విడుదలతో చేనేత సంఘాలకు లబ్ధి

చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే కార్మికులకు సైతం ఎంతో లబ్ధి చేకూరుతుందని కార్మిక సంఘ నాయకులు చెప్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తానికి మాత్రమే పరిమితమై చేనేత కార్మికులకు, సంఘాలకు ఉపయుక్తమైన ఎన్నో పథకాలకు మంగళం పాడేసింది. దాంతో జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు 20 నుంచి 40 శాతం నూలు సబ్సిడీపై రూ.3.55 కోట్లు బకాయిలు ఉండగా 20 నుంచి 30 శాతం చేనేత వస్త్రాల రిబేటు పథకంలో రూ.2.81 కోట్లు బకాయిలున్నాయి. త్రిఫ్ట్ ఫండ్ పథకంలో రూ.81.20 లక్షలు, పావలా వడ్డీ రాయితీ కిందరూ.3.56 కోట్లు, మార్కెటింగ్ ఇన్సెంటివ్ కింద రూ.3.40 కోట్లతో పాటు ఆప్కో చెల్లించాల్సిన బకాయిలు కోనసీమ జిల్లాకు రూ.వంద కోట్ల పైబడి ఉన్నాయి.

రూ.82 లక్షల మేర జీఎస్టీ లబ్ధి

చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీ భారాన్ని భరించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రూ.82లక్షల మేర జీఎస్టీ లబ్ధి చేకూరనుంది. చేనేత సహకార సంఘాలు ఏటా రూ.20 లక్షలు టర్నోవర్ దాటితే జీఎస్టీ పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం ఆమొత్తాన్ని రూ.40లక్షలకు పెంచారు. ఇంచుమించు ఉమ్మడి జిల్లాలోని సంఘాలన్నీ జీఎస్టీ పరిధిలోకి వచ్చాయి. దాంతో సహకార సంఘాలు కొనుగోలు చేసిన చిలపనూలుపై 5 శాతం జీఎస్టీ భారం పడింది. కోనసీమ జిల్లాకు రూ.55లక్షలు, కాకినాడ జిల్లాకు రూ.12లక్షలు, తూర్పు గోదావరి జిల్లాకు రూ.15లక్షలు జీఎస్టీ మినహాయింపు లభించనుంది. ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించి చేనేత సంఘాలకు చెల్లించే ఏర్పాట్లు చేసింది.

రూ.65లక్షల త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చేనేత కార్మికుల ఖాతాలకు రూ.65లక్షలు మేర త్రిఫ్ట్ ఫండ్ నిధులు జమకానున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా చేనేత కార్మికులు ఉండడంతో రూ.52లక్షలు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు రూ.13లక్షలు చొప్పున త్రిఫ్ట్ ఫండ్ నిధులు మంజూరు అయ్యాయని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు కె.పెద్దిరాజు తెలిపారు. ఇప్పటికే ఆయా మొత్తాలను సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేశామన్నారు. త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద ఒక్కో కార్మికుడు రూ.8 చొప్పున నిల్వ చేసుకుంటే దానికి రూ.16చొప్పున ప్రభుత్వం జమచేసి రూ.24 చొప్పున అందిస్తుంది.

జిల్లా	సాధారణ మగ్గాలు	ఉచిత విద్యుత్ రాయితీ
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	3610	రూ.2.17 కోట్లు
కాకినాడ	2150	రూ.1.29 కోట్లు
తూర్పు గోదావరి	788	రూ.0.47 కోట్లు

పాత పథకాలను పునరుద్ధరించాలి

దొంతంశెట్టి సత్యప్రకాష్, లివరీ చేనేత సహకార సంఘాల ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్



గతంలో టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన పథకాలను పునరుద్ధరించాలి. ప్రధానంగా పావలా వడ్డీ పథకం, నూలుపై సబ్సిడీ, 30శాతం రిబేటు విధానాన్ని కొనసాగించాలి. చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిపడ్డ మొత్తాలను తక్షణం విడుదల చేయాలి. తొమ్మిది నెలలుగా బకాయిలు విడుదల కాక చేనేత సహకార సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఆప్కోకు తక్షణం ఎన్నికలు నిర్వహించి సహకార సంఘాల నుంచి పూర్తిస్థాయిలో వస్త్ర ఉత్పత్తులు కొనుగోలు చేసి వెంటనే నిధులు విడుదల చేయాలి.

నేతన్నలకు హామీతో కూడిన ఉపాధి కల్పించాలి

చింతా శంకరమూర్తి, మాజీ జడ్పీటీసీ, బండారులంక



చేనేత కార్మికులకు హామీతో కూడిన ఉపాధి కల్పించాలి. గతంలో అమలుచేసిన జనతా వస్త్రాల పథకాన్ని పునరుద్ధరించాలి. నేత కార్మికులకు ఉపాధి హామీలో స్థానం లేకపోవడంతో ఉపాధికై ఎదురు చూస్తున్నారు. చేనేత రంగంపైజీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలి. తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి కల్పించే చేనేత పరిశ్రమకు అన్ని రకాల పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలి. చేనేత సహకారసంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు చేనేత వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి.

మారుమూల గ్రామంలో చేనేత దినోత్సవం

వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ మంత్రి



జాతీయ చేనేత దినోత్సవాన్ని రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో మారుమూల గ్రామమైన ఆదివారపుపేటలో నిర్వహించేందుకు చేనేత నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. 70 మంది కార్మికులకు రూ.50వేలు చొప్పున ముద్ర రుణాలు, 25 మందికి చేనేత మగ్గాలు అందిస్తాము. జిల్లాలోని చేనేత సహకార సంఘాల ప్రతినిధులను ఆహ్వానించాం. చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాము.

ఉమ్మడి జిల్లాలో మూడుచోట్ల చేనేత దినోత్సవ సభలు

కె.పెద్దిరాజు, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు



జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం. కోనసీమ జిల్లాకు సంబంధించి రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని ఆదివారపుపేటలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పాల్గొంటారు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురంలో జరిగే సభలో కలెక్టర్ షాన్‌మోహన్, తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం మురమండలో జరిగే చేనేత దినోత్సవంలో కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

ఎరుపెక్కిన రాజమహేంద్రి

- సుబ్రహ్మణ్య మైదానంలో సీపీఐ జిల్లా 26వ మహాసభలు ప్రారంభం
- కేంద్రం, రాష్ట్రంలో అసమర్థపాలన
- రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ



రాజమహేంద్రవరంలో సీపీఐ శ్రేణుల ప్రదర్శన

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎర్ర జెండాలతో కామ్రేడ్‌లు కదంతొక్కారు. సీపీఐ జిల్లా 26వ మహాసభలు రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్య మైదానంలో ఏర్పాటు చేసిన చిట్టూరి ప్రభాకర చౌదరి వేదికలో జరిగిన ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ముఖ్యవక్తలుగా విచ్చేశారు. తొలుత సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యంలో ప్రజా నాట్యమండలి కళాకారులతో నృత్య ప్రదర్శనలు, జానపద గేయాలతో భారీ స్థాయిలో కార్యకర్తలు స్థానిక చర్చిగేటు నుంచి ప్రదర్శనగా బయలుదేరి దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా సుబ్రహ్మణ్య మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రామకృష్ణ, అక్కినేని వనజ మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అసమర్థ పాలన సాగిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు ఏడాది కాలంలో నష్టపోయారని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తొలిరోజు జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కొండ్రపు రాంబాబు, రేఖా భాస్కర్రావు, కాకినాడ, కోనసీమ జిల్లాల కార్యదర్శులు కామిరెడ్డి గోడకొండ, దేవా రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు తోకల ప్రసాద్, వి.కొండలరావు,చప్పా రమణ,పి.లావణ్య, చింతలపూడి సునీల్, రెడ్డి రమణ, జీపీ రామారావు, నల్లా రామారావు, జ్యోతిరాజు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పుష్కర రైల్వే పనులు మొదలయ్యాయి

- ద.మ. రైల్వే జీఎం శ్రీవాస్తవ
- రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్ల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న రైల్వే జీఎం శ్రీవాస్తవ

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027కి సంబంధించి రైల్వే పనులు మొదలయ్యాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ప్రస్తుతం భౌతిక పనులకు ముందు జరిగే కసరత్తు నడుస్తోందని, భవన తదితర నిర్మాణాలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కచ్చితమైన ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అనుకున్న సమయానికి పనులు పూర్తయ్యేలా విధులు నిర్వర్తించడంతోపాటు ప్రయాణికులకు అన్ని సదుపాయాలు, సౌకర్యాలతో ఏర్పాట్లు ఉండే విధంగా పక్కా ప్లానింగ్‌తో ముందుకు వెళుతున్నామన్నారు. బుధవారం ఆయన రాజమండ్రి, గోదావరి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్లను పరిశీలించారు. రాజమండ్రి రైల్వేస్టేషన్లలో పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. వివిధ విభాగాల వద్ద ప్రస్తుతం ఉన్న ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఇంకా అవసరాలపై ఆరా తీశారు. మ్యాప్ ద్వారా పరిశీలించి సూచనలు చేశారు. స్టేషను రీ-మోడలింగ్‌లో భాగంగా తూర్పు వైపు ఐదు ఫ్లోర్లతో భవనం రానుంది. అయితే పుష్కరాల నాటికి కనీసం రెండు ఫ్లోర్లు పూర్తయ్యే విధంగా పనులు చేయాలని చెప్పారు. గదుల నిర్మాణం పూర్తి కాకపోయినా ఫ్లోర్లను పుష్కరాల విధులకు వచ్చే సిబ్బంది కోసం వినియోగించాలని సూచించారు. ఆరో ప్లాట్‌ఫాం పూర్తికావాలని ఆదేశించారు. అలాగే ప్రయాణికులు వేచివుండే ప్రదేశాల వద్దే టికెట్ కౌంటర్లు, తాగునీరు, ఫ్లాన్లు వంటివి ఏర్పాటు చేయాలని.. కలర్ కోడింగ్ కోడింగ్‌లను ఉపయోగించడం ద్వారా ప్రయాణికులు అయోమయానికి గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పుష్కరాల నాటికి పనులు ఏ మేరకు పూర్తయినా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉండే విధంగా ప్లాన్ చేసుకోవాలన్నారు. గోదావరి రైల్వే స్టేషనులో ప్లాట్‌ఫాం నిడివిని బ్రిడ్జి వైపు పొడిగించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా పరమైన ఏర్పాట్లపై ఆర్పీఎఫ్ డీజీజీ ఎస్‌జడ్ ఖాన్‌కి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్ఎం మోహిత్ సోనాకియా, ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ షణ్ముగం వడివేలు, ఎస్ఆర్‌పీ రాహుల్ దేవ్ సింగ్, ఆర్పీఎఫ్ ఏఎస్సీ కోటా జోజి, ఇన్‌స్పెక్టర్ రాజు, ఏడీఈఎన్ ముత్యాలరావు, ఎస్ఎం ఆర్.రంగనాథ్, సీటీఐ చంద్రమౌళి, జోన్, డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి ట్రాక్‌లను పరిశీలిస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్‌కు వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలి

కేంద్ర మంత్రి జితేందర్ సింగ్‌కు సానా సతీష్ నేతృత్వంలో ఎంపీల వినతి



కేంద్ర మంత్రి జితేందర్ సింగ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీలు

కాకినాడ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీకి వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలని కోరుతూ కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్‌ను బుధవారం న్యూఢిల్లీలోని టెక్నాలజీ భవన్‌లో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు నేతృత్వంలో రాష్ట్ర ఎంపీలు మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖకు సమర్పించిన అనేక కీలక ప్రతిపాదనలపై ఎంపీలు చర్చించారు. వ్యూహాత్మక అంతరిక్ష కేంద్రంగా హోదా కల్పించాలని, శాస్త్రీయ పరిశోధన మౌలిక సదుపాయాలు అందించాలని, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు డాప్లర్ వాతావరణ రాడార్ కవరేజ్ కల్పించాలని రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు కోరారు. వ్యూహాత్మక శాస్త్ర సాంకేతిక రంగంలో జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని ఎంపీల బృందం విన్నవించినట్లు సతీష్ క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

జంతు హింస నివారణకు కేంద్రం ప్రత్యేక చర్యలు

కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జంతు హింస నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ చెప్పారు. బుధవారం ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశు సంవర్థకశాఖ సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. జంతు హింస నివారణ చట్టం, 1960 ప్రకారం మొదటి తప్పిదానికి కనీసం రూ.10 నుంచి గరిష్టంగా రూ.50 వరకు జరిమానా విధిస్తున్నామని చెప్పారు. మూడేళ్లలో మరలా తప్పు చేస్తే రూ.25 నుంచి రూ.100 వరకు జరిమానా గానీ, మూడునెలల వరకు జైలు శిక్ష విధిస్తున్నట్టు ఆయన వెల్లడించారన్నారు. గత ఐదేళ్లలో అఖిల భారత జంతు సంక్షేమ బోర్డు దేశ వ్యాప్తంగా 4,589 ఫిర్యాదులు స్వీకరించి ఆయా రాష్ట్రాలకు పంపగా 306 కేసులపై చర్యలు తీసుకున్నట్టు చెప్పారన్నారు. ఏటా జనవరి 14 నుంచి ఫిబ్రవరి 13వరకు జంతు సంక్షేమ మాసం నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారన్నారు.

11న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా-2025

కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల్లో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న ఉదయం 9గంటలకు ఐటీఐ పాసైన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్టు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కన్వీనర్, కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జి.వేణుగోపాలవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్, స్టాఫ్ వచ్చి వారికి కావాల్సిన అప్రెంటిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి సెలెక్ట్ చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టీసీ సర్టిఫికేట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇస్తూ బుధవారం కాకినాడ కలెక్టర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నోడల్ అధికారి షాన్‌మోహన్ ఆదేశాలు ఇచ్చారు. రెవెన్యూ విభాగంలో ఉన్న వీరికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. వీరు కాకినాడ్ల, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

కాకినాడ మత్స్యకారులను విడిపించాలి

శ్రీలంకలోని భారత కాన్సుల్ అధికారికి కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ లేఖ

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా దురదృష్టవశాత్తూ శ్రీలంక దేశ సముద్ర జలాల్లోకి ప్రవేశించి బందీలుగా చిక్కిన కాకినాడ మత్స్యకారులు నలుగురిని విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం శ్రీలంకలోని భారత్ కాన్సుల్ జనరల్ అధికారి సాయిమురళీకి లేఖ రాశారు. కాకినాడ జగన్నాథపురానికి చెందిన పంతాడి బ్రహ్మానందంతోపాటు మరో ముగ్గురు మత్స్యకారులు ఈనెల 2న తమిళనాడులో రెండు బోట్లు కొనుగోలు చేసి సముద్ర మార్గం ద్వారా కాకినాడ తీరం వైపు వస్తుండగా రెండు రోజుల తర్వాత నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య వల్ల దారి తప్పి శ్రీలంక జలాల్లోకి ప్రవేశించడంతో వారిని కంకేసంతురై వద్ద శ్రీలంక నేవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారన్నారు. ప్రస్తుతం జాఫ్నాలో రిమాండ్‌లో ఉన్న నలుగురు మత్స్యకారులను విడుదల చేసి సురక్షితంగా స్వదేశానికి పంపాలని ఆయన లేఖలో పేర్కొన్నారు.

చదవడం, రాయడం కూడా నేర్వకపోతే ఎలా?

ఆర్జేడీ నాగమణి

సామర్లకోట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తున్నందున విద్యార్థులకు కనీసం చదవడం, రాయడం కూడా నేర్వకపోతే ఎలా అని విద్య ఆర్జేడీ నాగమణి ఉపాధ్యాయులను ప్రశ్నించారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నం జమునానగర్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల అకడమిక్ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చదవడం, రాయించడంతో బాటు కూడిక, తీసివేత, గుణకారం, భాగాహారాలు, తరగతికి చెంది ఎక్కాలను కూడా అడిగి విద్యార్థుల మేధస్సు తీరు పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవలే ఉపాధ్యాయుల సమీక్షలో సాక్షాత్తూ డీఈవో పలువురు ఉపాధ్యాయుల తీరును హెచ్చరించిన విషయం విదితమే. ఉపాధ్యాయులుగా మనం అంచెలంచెలుగా మారుతున్నప్పుడు విద్య బోధన తీరులో పోకడలు మార్చాలి కదా అని గుర్తు చేశారు. ప్రాథమిక విద్యాస్థాయిలోనే చదవడం, రాయడం అందరు విద్యార్థులు అలవర్చుకునేలా తీర్చిదిద్దాలని ఆర్జేడీ నాగమణి హితవు పలికారు. ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బీజేపీ విజయం

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కాకినాడ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బీజేపీ విజయం సాధించిందని, 2029లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. కాకినాడలోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలో వున్న 11 ఏళ్ల కాలంలో బ్యాంకు లకు రూ.100 కోట్లు పైబడి బకాయిపడిన పారిశ్రామికవేత్తలకు రూ.14.50 లక్షల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. ఇందులో బీజేపీ పెద్దలకు లబ్ధి చేకూరుతూ లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్, అరకు ప్రాంతాల మధ్య ఖనిజాలను పారిశ్రామికవేత్తలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను చిత్రహింసలకు గురిచేస్తోందన్నారు. రకరకాలుగా హింసించి చంపడంతో పాటు కొందరి మర్మాంగాల్ని కోసేశారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో మద్యం పాలసీ విధానంలో కోట్లాది అవినీతి జరిగిందని, అందులో ఉన్న ప్రతిఒక్కరూ జైలుకు పోతారన్నారు. మద్యం కుంభకోణంలో జయలలిత, కేజ్రీవాల్, కవిత జైలుకెళ్లారని, జగన్ కూడా వెళ్లడం ఖాయమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో చోరీ.. తునిలో వదిలి పరారీ..



- సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు లారీ అపహరణ
- రూ.28 లక్షల విలువైన సరుకు మాయం
- రెండు రోజుల క్రితం ఇదే తరహాలో సంఘటన

పిఠాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడుతో ఉంచి లారీ చోరీకి గురి కావడం సంచలనం కలిగించింది. అందులో ఉంచిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అపహరించి లారీని తుని సమీపంలో వదిలివేసి పరారయ్యారు చోరీకి పాల్పడిన ఆగంతకులు.

కాకినాడలోని డైరీఫారమ్ సెంటర్‌కు చెందిన ఓనర్ కమ్ డ్రైవర్ దగ్గు అప్పారావు నగర శివారులోని జెమిని కంపెనీ వద్ద సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను తన లారీలో మంగళవారం సాయంత్రం లోడు చేసుకున్నాడు. లోడు లారీతో రాత్రి 8.30గంటల సమయంలో పిఠాపురం తీసుకు వచ్చి వెలంపేటకు చెందిన డ్రైవర్ నాళం రమణకు అప్పగించాడు. లోడు ఒరిస్సాలోని భువనేశ్వర్ తీసుకువెళ్లాలని చెప్పి పిఠాపురంలోని కుంతీమాధవస్వామి ఆలయం సమీపంలో లారీని పార్కు చేశాడు. బుధవారం ఉదయం 5.30గంటల సమయంలో నాళం రమణ వచ్చి చూసుకునే సరికి లారీ మాయమైంది. గుర్తుతెలియని ఆగంతకులు లారీతో ఉడాయించినట్టు గుర్తించాడు. వెంటనే యజమానికి దగ్గు అప్పారావుకు సమాచారం అందించాడు. అందులో రూ.28లక్షలు విలువైన సన్‌ఫ్లవర్ ఆయిల్‌ప్యాకెట్లు ఉండడంతో అప్పారావు పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీసీ కెమెరాలు, గొల్లప్రోలు టోల్‌గేటు వద్ద రికార్డులు, అక్కడ ఉన్న కెమెరాలు పరిశీలించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 1.27గంటలకు టోల్‌గేట్ దాటినట్టు గుర్తించారు. ఫాస్టాగ్ ద్వారా కాకుండా టోల్‌ఫీజును నగదు రూపంలో చెల్లించారు. దీంతో సమీపంలోని అన్ని పోలీసుస్టేషన్లకు సమాచారం అందించారు. ఉదయం 11 గంటల సమయంలో లారీని తుని సమీపంలో 16వ జాతీయ రహదారిపై గల ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో వదిలివేసినట్టు సమాచారం వచ్చింది. దీంతో అక్కడకు వెళ్లి చూడగా అందులో సరుకు పూర్తిగా మాయమైంది. ఖాళీ లారీ మాత్రమే అక్కడ ఉంది. అందులోని సరుకును గొల్లప్రోలు-తుని మధ్య ఎక్కడో చోరీకి పాల్పడిన ఆగంతకులు డంప్ చేసి లారీని వదిలివేసి పరారైనట్టు భావిస్తున్నారు. ఈ సంఘటన పిఠాపురం పరిసర ప్రాంతాల్లో తీవ్ర సంచలనం కలిగించడంతో పాటు చర్చనీయాంశంగా మారింది. సన్‌ఫ్లవర్ లోడు లారీని ఆగంతకులు ఎలా గుర్తించారు, ఇది తెలిసున్న వారి పనా, లేకుంటే లారీని ఫ్యాక్టరీ నుంచి ఫాలో అవుతూ వచ్చిన వారు ఈ సంఘటనకు పాల్పడ్డారా అని అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అదేవిధంగా లారీని ఆగంతకులు తీసుకువెళ్తున్న సమయంలో ఒకవ్యక్తి మోటార్‌సైకిల్‌పై టోల్‌గేట్ దాటే వరకూ వెన్నంటి ఉండటం పోలీసుల విచారణలో వెల్లడైంది.

తుని ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో వదిలివేసిన ఖాళీ లారీ

పోలీసుల తీరుపై విమర్శలు

చోరీలు అధికమవుతున్నా పోలీసులు సరైన నిఘా ఉంచకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2రోజుల క్రితమే లారీ చోరీకి గురై దొరికిన సంఘటన జరిగినా దానిపై పోలీసులు విచారణ జరపకపోవడం, రాత్రి పూట గస్తీ పెంచకపోవడంతో ఇటువంటి ఘటన వెనువెంటనే జరగడానికి కారణమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల పిఠాపుంతో పాటు నియోజకవర్గంలో చోరీలు ఎక్కువైనా రాత్రిళ్లు నిఘా ఎందుకు ఉంచడంలేదనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

మరో లారీ చోరీ...

పిఠాపురంలో ఇదే తరహాలో ఆదివారం రాత్రి ఒక లారీ చోరీకి గురైంది. డ్రైవర్స్‌కాలనీలోని టీడీపీ నాయకుడికి చెందిన నూకలలోడుతో ఉన్న లారీని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. అయితే లారీకి జీపీఎస్ ఉన్న విషయాన్ని గుర్తించిన ఆగంతకులు తాము దొరికిపోతామనే భయంతో రౌతులపూడి మండలం గిడజాం వద్ద వదిలి పరారయ్యారు. దీంతో సరుకుతో సహా సదరు నాయకుడు లారీని తెచ్చుకున్నారు.



నీలి మేఘం.. గోదారితో స్నేహం...

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గౌతమి గోదావరిలో బుధవారం ఈ అందమైన దృశ్యం విశేషంగా ఆకట్టుకుంది. ఒకపక్క ఎండ సుర్రుమనిపిస్తుంటే ఆ వెంటనే చల్లగా నీలిమేఘం దిగివచ్చి గోదావరిని తాకుతున్నట్టు కనిపించిన దృశ్యం గోదావరి బ్రిడ్జిపై ప్రయాణించే వారిని అబ్బురపరిచింది - ఆలమూరు (ఆంధ్రజ్యోతి)

కువైట్‌లో పొన్నమండ యువకుడి మృతి

అధికారుల చొరవతో స్వగ్రామానికి మృతదేహం



దుర్గాసంతోష్ (ఫైల్)

రాజోలు/అమలాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పొన్నమండకు చెందిన కడలి సూర్యనారాయణకుమారుడు దుర్గాసంతోష్ (35) ఇటీవల కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతిచెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు బుధవారం తెలిపారు. దుర్గాసంతోష్‌కు మలికిపురం మండలం లక్కవరానికి చెందిన సాయికుసుమతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. జీవనోపాధి నిమిత్తం దుర్గా సంతోష్ 3 నెలల క్రితం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ నివాసం ఉంటున్న గదిలోని ఏసీకి ప్రమాదవశాత్తూ మంటలు అంటుకోవడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. కువైట్ నుంచి సంతోష్ మృతదేహం బుధవారం పొన్నమండకు చేరుకుంది. దుర్గాసంతోష్ అంత్యక్రియలు గురువారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. దుర్గాసంతోష్ మృతదేహాన్ని చూసి భార్య, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టిస్తుంది. ఈ విషయంపై కోనసీమ కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పొన్నమండకు చెందిన దుర్గాసంతోష్ మరణించడం దురదృష్టకరమని తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ కీలకంగా పనిచేసి మృతదేహాన్ని గుర్తించడంలో సహాయపడ్డారని తెలిపారు. దాంతో కువైట్ నుంచి కార్గో విమానంలో హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ఏపీ ఎన్ఆర్టీవారి సహాయ సహకారాలతో అంబులెన్సు ఏర్పాటుచేసి ఆ మృతదేహాన్ని పొన్నమండలోని దుర్గాసంతోష్ స్వగృహానికి చేర్చడంలో అధికారులంతా కృషి ప్రశంసనీయమన్నారు. వికాస పీడీ కె.లచ్చారావు, మేనేజర్ జి.రమేష్, సిబ్బంది, మహిళా పోలీసులు షేక్ బీబీసఫియా, హెచ్‌కానిస్టేబుల్ సత్తిబాబును కలెక్టర్ అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు

తమ్మయ్యపేట వద్ద ఘటన



మరణించిన అబ్బు

తొండంగి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోదాడ గ్రామానికి చెందిన దడాల అబ్బు (56) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ గ్రామానికి చెందిన అబ్బుకు నడుము నొప్పి కారణంగా కుమారుడు రాజకుమార్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై కాకినాడ ఆసుపత్రికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మోటార్ సైకిల్‌ను రాజకుమార్ నడుపుతుండగా అబ్బు వెనుక కూర్చున్నాడు. తమ్మయ్యపేట కాగితాలమ్మ గుడి వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఇద్దరు కిందపడ్డారు. రాజకుమార్‌కు గాయాలు కాగా అబ్బు తలకు బలమైన గాయమై చెవుల నుంచి రక్తం కారింది. బంధువులకు సమాచారం అందించడంతో వారు తుని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అబ్బును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. రాజకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు



భీమనపల్లి ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారుల బృందం

రూ.24,52,346 విలువైన ఎరువులు సీజ్

ఉప్పలగుప్తం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి శ్రీలక్ష్మీనారాయణ ఏజెన్సీలో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో 100 టన్నుల ఎరువులు స్టాకు రిజిష్టర్‌లో నమోదు కానట్టు గుర్తించారు. రూ.24,52,346 విలువైన ఎరువులు సీజ్ చేసినట్టు ఏవో గుత్తుల కుమార్‌బాబు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

15,190 కిలోల బియ్యంతో లారీ స్వాధీనం



పట్టుబడిన లారీతో ఎంఎస్‌వో బాపిరాజు

రాజానగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు సమీపంలో రాజానగరం మండల సివిల్ సప్లై అధికారి గొలుగూరి బాపిరాజు పట్టుకున్నారు. రాజానగరం మండలం ఆటోనగర్ సమీపంలో గ్రామన్ బ్రిడ్జ్ రోడ్డుపై కొవ్వూరు వైపు నుంచి దివాన్‌చెరువు వైపు వెళ్తున్న లారీలో పీడీఎస్(రేషన్)బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. లారీ ముందు తెలుపు రంగు కారులో ఇద్దరు ఎస్కార్ట్‌గా వెళ్తున్నారని చెప్పారు. ఏవిధమైన కాగితాలు తనకు ఇవ్వలేదని, లోడు కూడా మొక్కజొన్న లోడు అని తనకు చెప్పారని, అంతకు మించి తనకు ఏమీ తెలియదని లారీ డ్రైవర్ తంగిరాల ఏడు కొండలు బదులిచ్చాడన్నారు. రేషన్ బియ్యం బస్తాలను పరిశీలించగా 83 ప్లాస్టిక్ సంచుల్లో 3,140 కిలోలు, 241 సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సంచుల్లో 12050 కిలోలు, మొత్తం 324 సంచుల్లో 15,190 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. బియ్యం విలువ రూ.6,98,740గా అంచనా వేశామన్నారు. డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు బియ్యం యజమాని ఫోన్ నెంబరు తప్ప మరే ఇతర సమాచారం లేదని, ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుందని, ట్రూకాలర్ ప్రకారం మహమ్మద్ అలియా అని వస్తున్నట్టు ఎంఎస్‌వో చెప్పారు. బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

వాడపల్లిలో ముగిసిన వెంకన్న పవిత్రోత్సవాలు



ఆలయంలో స్వామివారికి పవిత్రాలతో అలంకరణ

ఆత్రేయపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 3 రోజుల పాటు తిరుమల తరహాలో నిర్వహించిన పవిత్రోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. వసంతమండపంలో ఉత్సవ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాశాంతి హోమం, ప్రాయిశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, పవిత్రవిసర్జన, మహాదాశీర్వచనం, తదితర కార్యక్రమాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు స్వామివారి పవిత్రోత్సవాలను నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు పవిత్రాలను అలంకరించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉపకమిషనర్ ఈవో నల్లం సూర్యచక్రధరరావు, డీఎస్పీ సుంకర మురళీ మోహన్, కూటమినాయకులు, దాతలు స్వామివారిని దర్శించుకున్నారు.



పవిత్రోత్సవ పూజల దృశ్యం

అభివృద్ధి పనుల పరిశీలన

వెంకన్న ఆలయంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్రీరామరాజు, భారతి విద్యాభవన్ ఛైర్మన్ ఉద్దరాజు విశ్వనాధరాజు, రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ సెక్రటరీ కొత్త శ్రీనివాస్, గాంధీ, సురేష్ ప్రముఖులతో కలిసి పరిశీలించారు. వకుళమాత అన్నదాన భవనంలో రూ.1.50కోట్లతో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రామరాజును కోరగా సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కాటేజీ నిర్మాణానికి రూ.10లక్షల విరాళం అందించేందుకు కొత్త శ్రీనివాస్ ముందుకు వచ్చారని తెలిపారు.

హోరాహోరీగా..

కాకినాడలో ఆరో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు



హాకీ ఆడుతున్న మణిపూర్, అస్సాం జట్లు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్ షిప్2025లో భాగంగా కాకినాడలో బుధవారం ఆరో రోజు మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. అస్సాం, మణిపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మణిపూర్ 3-1తో విజయం సాధించింది. కేరళ, ఉత్తరాఖండ్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 7-0 స్కోర్‌తో విజయం సాధించింది. హిమాచల్‌ప్రదేశ్, బీహార్ జట్ల మ్యాచ్ 1-1 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్ మ్యాచ్‌లో తమిళనాడు 5-0, మధ్యప్రదేశ్, పంజాబ్ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 4-0తో విజయం సాధించాయి. హర్యానా, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మ్యాచ్‌లో జార్ఖండ్ 7-1తో విజయం సాధించింది. ఒరిస్సా, మహారాష్ట్ర మ్యాచ్‌లో మహారాష్ట్ర 2-1తో విజయం సాధించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జీఎం బి.కిరణ్‌కుమార్, కాకినాడ జిల్లా ముఖ్య ప్రణాళికారి పి.త్రి నాథ్, చేయూత స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ ఎం.రవికుమార్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను వీక్షించారు. హాకీ సంఘ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.థామస్‌పీటర్, భవానీశంకర్ పర్యవేక్షించారు.





జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మ్యాచ్ దృశ్యాలు

అదరగొట్టిన అక్కాచెల్లెళ్లు

మలికిపురం మహిళలకు ఎస్ఐలుగా ఒకేచోట పోస్టింగ్



ఎస్ఐలు కరుణ, రేవతి

మలికిపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురానికి చెందిన కడలి కరుణ, కడలి రేవతి అక్కాచెల్లెళ్లు. వారిద్దరు ఎస్ఐ కోచింగ్ తీసుకుని ఒకేసారి ఎంపికయ్యారు. వారికి మోకా సత్తిబాబు కోచింగ్ సెంటర్ నందు ఉచిత కోచింగ్ అవకాశం కల్పించారు. అక్కాచెల్లెళ్లు ఎస్ఐలుగా ఎంపికవ్వగా విజయవాడసిటీ పోలీసుస్టేషన్‌లో పోస్టింగ్ లభించింది. వారి తండ్రి వెంకటేశ్వర్లు చికెన్ సెంటర్ నందు పనిచేస్తుండగా తల్లి గృహిణి. వారికి ఎస్ఐలుగా పోస్టింగ్ రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

గండేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లిలో జాతీయరహదారి పక్కన ఉన్న ఒక ఇంట్లో జనవరి 2న చోరీ జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా చోరీకి పాల్పడ్డ కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ షబ్బీర్‌ను బుధవారం గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. రూ.9వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో ప్రవేశపెట్టగా 14రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

నకిలీ ఈపీఎఫ్ చలానాలపై

అన్నవరంలో ఆర్జేసీ విచారణ



ఈవో కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఆర్జేసీ త్రినాథరావు

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శానిటరీ కార్మికుల పీఎఫ్ చెల్లింపులకు సంబంధించి నకిలీ చలానాల వ్యవహారంపై దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలతో బుధవారం ఆర్జేసీ త్రినాధరావు విచారణ చేపట్టారు. ఈవో కార్యాలయంలో శానిటరీ విభాగ అధికారులు, శానిటరీ కాంట్రాక్టర్‌ను పిలిచి దీనికి సంబంధించి విచారణ చేపట్టారు. నకిలీ చలానాలు ఏవిధంగా సమర్పించారు అని కాంట్రాక్టర్ తరుపున వ్యక్తిని ప్రశ్నించగా అవి తాము సమర్పించినవి కాదని, తాము సమర్పించినవయితే తమ సంస్థ స్టాంప్, సంతకం ఉంటాయని వివరణ ఇచ్చారు. వివాదం తరువాత ఒకే నెలలో 3 రసీదులు ఒరిజనల్ ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. ఇరువర్గాల నుంచి సమాచారం సేకరించిన ఆర్జేసీ త్రినాధరావు నివేదికను కమిషనర్‌కు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, శానిటరీ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ గుర్రాజు తదితరులు ఉన్నారు.

దంపతులను నాటు తుపాకీతో కాల్చిన వ్యక్తి అరెస్ట్

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం శృంగధారలో కాకూరి చంద్రరావు, అతడి భార్య సూర్యావతిలను నాటు తుపాకీతో కాల్చిన సంఘటనలో నిందితుడిని బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వివరాలు వెల్లడించారు. శృంగధారకు చెందిన సూర్యావతి రాజవొమ్మంగి మండలానికి చెందిన ముర్ల మణికుమార్‌తో వివాహేతర సంబంధం కలిగి ఉండి సహజీవనం చేసింది. భర్త, పిల్లలు గుర్తుకురావడంతో వారంక్రితం శృంగధారలో భర్త ఇంటికి చేరుకుంది. దీంతో కక్ష పెంచుకున్న మణికుమార్‌తో నాటు తుపాకీతో చంద్రరావు, సూర్యావతిని ఈనెల 3న రాత్రి కాల్చి గాయపరిచి పరారయ్యాడు. అతడిని పెద్దమల్లాపురం శివార్లలో అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

బైక్‌పై యువకుల ప్రమాదకర ఫీట్లు

అదుపులోకి తీసుకున్న పోలీసులు

పిఠాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై అతి వేగంగా వెళ్తూ ప్రమాదకర ఫీట్లు వేసి విద్యార్థులు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన యువకులను కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ యాక్టు 125 కింద కేసు నమోదు చేశారు. పిఠాపురం పాతబస్టాండు వద్ద నుంచి ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా ఉప్పాడ బస్టాండు వరకు ఇద్దరు యువకులు మంగళవారం పలుమార్లు బైక్‌పై విన్యాసాలు చేస్తూ ఆందోళనకు గురిచేశారు. దీంతో పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు.

మహాలక్ష్మిగా రత్నగిరి వనదుర్గమ్మ



మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న వనదుర్గమ్మ

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మ అమ్మవారు శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం మహాలక్ష్మి అమ్మవారిగా భక్తులను అనుగ్రహించారు. అష్టఐశ్వర్యాలు ప్రసాదించే దేవతగా దర్శనమిచ్చారు. ప్రముఖ వ్యాపారస్తుడు వీర్ల సూరిబాబు కుటుంబసభ్యులు అమ్మవారికి సారె సమర్పించారు. విశేష పూజలు నిర్వహించారు.

22న రత్నగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిదిలో ఉచిత శ్రావణ శుక్రవార సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఈ నెల 22న నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు.

పంటకాలువలో జారి పడి బాలిక మృతి



పంటకాలువలో బాలిక మృతదేహం కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

కొత్తపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కండ్రిగ శివారు పులుసుగంటివారిపేటకు చెందిన యార్లగడ్డ లోకేశ్వరి(15) ప్రమాదవశాత్తు అమలాపురం- పలివెల ప్రధాన పంట కాలువలో జారి గల్లంతైంది. ఆచూకీ కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలించగా మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. కండ్రిగకు చెందిన యార్లగడ్డ వెంకటరమణకు పిల్లలు లేకపోవడంతో బంధువుల నుంచి ఓ బాలిక తీసుకుని కుమార్తెలా చూసుకుంటున్నాడు. మంగళవారం ఇంట్లో చెత్తను కాలువలో పడవేసేందుకు లోకేశ్వరి వెళ్లగా కాలు జారి గల్లంతైనట్టు ఎస్ఐ తెలిపారు. దీనిపై వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కొవ్వూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గేదెలను లంకలో మేతకు తోలుకెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన ఇంటి అప్పారావు (49) ఈ నెల 4న గేదెలను మేత కోసం గోదావరి మధ్య లంకలలోకి తోలుకెళ్లాడు. సాయంత్రం గేదెలు తిరిగివచ్చాయి. అప్పారావు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. గ్రామంలోని ఇసుక ర్యాంపు వద్ద తలపాగా, సెల్‌ఫోను, షర్ట్ దొరకడంతో గోదావరిలో గల్లంతై ఉండవచ్చని కుటుంబ సభ్యులు 2రోజులుగా నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో అప్పారావు కుమారుడు ఇంటి అనంత సత్యనారాయణమూర్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

వ్యాక్సిన్లు సకాలంలో అందించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ కోమలి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కోమలి

దివాన్‌చెరువు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వ్యాధినిరోధక వ్యాక్సిన్లను అందరూ సకాలంలో తీసుకునేవిధంగా తగిన శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కోమలి అన్నారు. పాలచర్లలోని పీహెచ్‌సీని, పాలచర్ల, గాడాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఏఎన్ఎంలకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు మింగలేని అంగన్‌వాడీ పిల్లలకు పొడుం చేసి ఇవ్వాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల పిల్లలకు అందరికీ ఈ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. ఏదైనా కారణంతో 12న ఈ మాత్రలు వేసుకోకుండా మిగిలిన వారి కోసం మ్యాపింగ్ అప్ కార్యక్రమం 20న నిర్వహిస్తామని పీహెచ్‌సీ డాక్టర్ బెనడిక్ట్ చెప్పారు.తల్లిదండ్రులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బుర్రిలంకలో రక్తదాన శిబిరం

కడియం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రిలంక గ్రామంలో కొత్తపల్లి శివాజీ-మూర్తి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 95 మంది రక్తదానం చేశారు. మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు, యాదల స్టాలిన్, గిరజాల బాబు, తాడాల చక్రవర్తి, దొంతంశెట్టి వీరభద్రయ్య, తిరుమలశెట్టి శ్రీను పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

బుర్రిలంకలో రైతుల ఆందోళన

కడియం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి తమ సమస్యలు పరిష్కరించాలని బుర్రిలంక గ్రామ రైతులు బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ ఆరేళ్ల క్రితం పాడయిందని, తమ సమస్య చెప్పిన తర్వాత పలువురు ఏఈలు, లైన్‌మేన్‌లు మారారని అయినా సమస్య అలానే ఉండిపోయిందన్నారు. దీనిపై అలానే ప్రజాప్రతినిధులకు చెప్పిన రేపు మాపంటూ కాలయాపన చేస్తున్నారని రైతులు వాపోయారు. కరెంటు లేక మొక్కలకు నీరందించలేక పోతున్నామని, ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాటంశెట్టి సుబ్బారావు, చెల్లయ్యగారి బుజ్జి, తూపాటి రమణ, శ్రీకాకుళపు దుర్గారావు, కొత్తపల్లి శ్రీను, ఈలి చినకాపు, పాటంశెట్టి దుర్గాబాబు, కొత్తపల్లి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొని అమ్మమ్మ, మనవడికి గాయాలు

అనపర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వేమగిరి-సామర్లకోట కెనాల్ రోడ్డులో అనపర్తి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమ్మమ్మ, మనవడికి తీవ్రగాయాలయ్యాయి. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. ద్వారపూడికి చెందిన గునిపల్లి సాయిసురేంద్ర తన అమ్మమ్మను అనపర్తిలోని ఆసుపత్రికి వైద్యం నిమిత్తం బైక్‌పై తీసుకొస్తుండగా కెనాల్ రోడ్డులో వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో అనపర్తిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సాయి సురేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

ఆడపిల్ల పుట్టిందని అత్తింటి వేధింపులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుట్టిందని ఓమహిళను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తమామలపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ తెలంగాణా రాష్ట్రాల చైర్‌పర్సన్ ఖండవిల్లి లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నరేంద్రపురానికి చెందిన దేగల వర్ధినిలక్ష్మికి, గోకవరం మండలం వీరలంకపల్లికి చెందిన ప్రగడ నాగదుర్గారావుకు 2022లో వివాహమైంది. రెండెకరాల పొలం, రూ.35 లక్షల నగదు, 30 కాసుల బంగారం కట్నంగా ఇచ్చారని తెలిపారు. 18 నెలలు కాపురం సక్రమంగా జరిగిందని, అటుపై వర్ధినికి ఆడబిడ్డ పుట్టడంతో కాపురానికి రావద్దని ఇబ్బందులు పెట్టారని, అత్తింటికి వెళ్లగా బయటకు గెంటేశారన్నారు. హైదరబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న దుర్గారావు బెట్టింగ్‌ల్లో నష్టపోయాడని, ఆడబిడ్డ పుట్టింది కాబట్టి అదనపు కట్నం తేవాలని, లేకుంటే వెళ్లిపోమని వేధించారని ఖండవిల్లి లక్ష్మి తెలిపారు.బాధిత మహిళకు న్యాయం చేయాలని లేకుంటే ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

రంగంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని జాగ్రత్తలు పాటించాలని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి సూచించారు.బుధవారం రంగంపేట హైస్కూల్లో పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎం.ఇందిర ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిర 329 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, 15 మందికి కళ్లజోళ్లు అవసరమని చెప్పారు. కళ్లకు సంబంధించిన పలు జాగ్రత్తలు విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ ఎల్.శ్రీనివాసరాజు, పీటీఐలు బి.వెంకటేశ్వర్లు, బి.లక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాజానగరంలో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

రాజానగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాజానగరంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో స్థానిక అన్నదాన సత్రం కళ్యాణ మండలంలో ఆత్మబంధువులం సేవా సంఘం ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రేస్ క్యాన్సర్ హైదరాబాదు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరాన్ని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రామకృష్ణ ప్రారంభించారు. ఈ శిబిరంలో 59 మంది పురుషులకు, 39 మంది మహిళలకు క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహిచారు. అలాగే క్యాన్సర్ లక్షణాలు, ముందుగా గుర్తించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆత్మ బంధువులం సేవా సంస్థ ఫౌండర్ అండ్ కోఆర్డినేటర్ శీతాల ఉషాకిరణ్, సెక్రటరీ మేనా నానాజీ, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘శక్తి’తో మహిళలకు భద్రత: సీఐ గణేష్



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ గణేష్

ధవళేశ్వరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎక్కడకు వెళ్లినా వారి భద్రతకు పోలీసు శాఖ రూపొందించిన శక్తి యాప్ అండగా ఉంటుందని సీఐ గణేష్ పేర్కొన్నారు. బుధవారం ధవళేశ్వరంలోని అంబేడ్కర్ ఎస్సీ బాలికోన్నత గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తియాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా రక్షణ ఉంటుందన్నారు. మహిళ అత్యవసర పరిస్థితుల్లో ఆపద సమయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే అవసరం లేకుండా శక్తి ద్వారా డయల్ 112కు ఫిర్యాదు చేస్తే వెంటనే శక్తి టీం సభ్యులు సకాలంలో ఆ ప్రాంతానికి చేరుకుని తగిన సహాయ సహకారాలు అందజేస్తారని పేర్కొన్నారు. అలాగే 79934 85111 శక్తి యాప్ వాట్సాప్ నెంబర్ డయల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. చట్టవ్యతిరేక కార్యాలయాలు, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్ వంటి వాటిపై 112కు డయల్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, శక్తి టీం సిబ్బంది, స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

10న రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఎంకే చెస్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోటీలను పిడింగొయ్యి గ్రామంలోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ న్యూ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నట్టు జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ది ఫ్యూచర్ కిడ్స్ స్కూలు ఈ పోటీలకు స్పాన్సర్‌గా వ్యవహరిస్తుందన్నారు. ఈ పోటీలు అండర్-6, అండర్-8, అండర్-10, అండర్-12, అండర్-14, అండర్-16 విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా నిర్వహించనున్నట్టు చెప్పారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు www.apches s.org అనే వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేయించుకోవాలని, ఇప్పటి వరకు 200 మంది క్రీడాకారులు రిజిస్టర్ అయ్యారని కుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ 98483 74133 నెంబర్‌ను సంప్రదిచాలని కోరారు.

గరగలంపాలెంలో కత్తిపూజ

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

కోరుకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరగలం పాలెం గ్రామంలో బుధవారం గరగాలమ్మ మహిళా కోలాట భజన మండలి కత్తిపూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు ప్రదర్శించిన కోలాట ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని తిలకించిన విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.50 వేలు నగదు బహుమతి అందజేశారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు పరిరక్షణ, సనాతన ధర్మ పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బత్తుల నానాజీ, ఉంగరాల మణిరత్నం, దేశాల నరేష్, ధారా శ్రీను పాల్గొన్నారు.

27నుంచి గణపతి నవరాత్రులు

దివాన్‌చెరువు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఈనెల 27 నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. వచ్చే నెల 8వ తేదీ వరకూ జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబరు 1న స్వామివారి సదస్యం, శ్రీపుష్పయాగం, 8న స్వామివారి ఊరేగింపు, అన్నదానం జరుగుతాయని పేర్కొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
- నగరంలో పలు ఎండోమెంట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధికి ఎండోమెంట్ కమిటీలు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక తిలక్‌రోడ్‌లోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సమిష్టిగా 2024 ఎన్నికల్లో తన విజయానికి పనిచేశారని, ఆ నాయకులకు, కార్యకర్తలకు సముచితస్థానం కల్పించాలనే ఆలోచనతో నగరంలోని 14 ఎండోమెంట్ కమిటీలు వేసేందుకు చర్యలు తీసుకున్నామని, ఇందులో 4 కమిటీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా కమిటీల చైర్మన్ల వివరాలను వెల్లడించారు. నాళం భీమరాజు వీధిలోని శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా ఎంఎస్‌పీవీ సత్యనారాయణ, సారంగదారేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా కేవీడీఎస్‌వీ చౌదరి, నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా చింతా జోగినాయుడు, కోరుకొండ రోడ్డులోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా వైవీవీ దుర్గాప్రసాద్ నియమితులయ్యారని తెలిపారు. అలాగే శ్రీఉమామార్కండేయస్వామి దేవస్థానం చైర్మన్‌గా మదన్‌సింగ్ రాజ్‌పురోహిత్, శ్రీశ్యామలాంబ దేవస్థానం చైర్మన్‌గా కడియాల వీరభద్రరావు, శ్రీపందిరి మహదేవుడు సత్రం చైర్మన్‌గా రెడ్డి మణీశ్వరరావు, జాంపేట శ్రీఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా దాసరి గురునాదరావు నియమితులయ్యారన్నారు. అతిత్వరలో ఈ కమిటీలు కూడా ప్రమాణ స్వీకారం చేస్తాయని స్పష్టం చేశారు. ఈ కమిటీల పదవీకాల పరిమితి రెండేళ్లు ఉంటుందని, అటుపై మరో రెండేళ్లకు కొత్తవారికి అవకాశం ఇస్తామన్నారు.

వైసీపీ వారితో జైలు నిండిపోయేది!

గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడి ఉంటే ఈ ఏడాది కాలంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వైసీపీ వారితో నిండి పోయి ఉండేదని ఎమ్మెల్యే వాసు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సఖ్యతతో ఉన్నారని, వైసీపీ గ్రౌండ్‌స్థాయిలో జీరో అయిపోయిందని చెప్పారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు జరిపిస్తామన్నారు. టిడ్కో గృహాలు కూడా లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ నెలాఖరుకు 5,500 కొత్త రేషన్‌కార్డులు జారీ చేస్తామని, త్వరలో 9,600 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కూటమి నాయకులు కాశి నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, వై శ్రీను, దొండపాటి సత్యంబాబు, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకిరామయ్య, బుడ్డిగ రవి, జి.నాగేంద్ర, కంటిపూడి శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- రంగంపేట, అనపర్తిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



మర్రిపూడిలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతులను కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని మర్రిపూడిలో రూ.1.20 కోట్లతో మర్రిపూడి-ఆర్‌బీ పట్నం బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లను పట్టించుకోకుండా గాలికి వదిలేయడంతో రోడ్లన్నీ చెరువులను తలపించేలా ఉండేవని, కూటమి ప్రభుత్వం తక్షణమే నిర్మాణాలు చేపట్టి పూర్తిచేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను,కొమ్మన రాంబాబు, పుట్టా సోమన్నచౌదరి, ఎంపీడీవో వీవీ సాయిబాబు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని కుతుకులూరు, రామవరం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో రూ.3.4 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా పెడపర్తి, తాపేశ్వరం సెక్షన్‌లోని మండపేట ప్రధాన కాలువపై నిర్మించిన డీపీ (డైరెక్ట్ పైప్‌లైన్)ను ప్రారంభించారు. అనంతరం లక్ష్మీనరసాపురంలోని కొత్త కాలనీలో నిర్మించే వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. రామవరంలో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, రిటర్నింగ్ వాల్ ప్రారంభోత్సవాలు, బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేంద్రంలోని ప్రధాని మోదీ సహకారంతో అభివృద్ధి, సంక్షేమాల్లో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి బులిరెడ్డి, రావాడ నాగు, ఎన్ఆర్‌కే ప్రసాదరెడ్డి, కర్రి శేషారత్నం, గిరిడా గంగాభవాని, డీసీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, చింతా సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కోరుకొండ సీఐపై ఆరోపణలు.. విచారణ

నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్

కోరుకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ సీఐ సత్యకిషోర్‌పై సోషల్ మీడియా, పత్రికలు, డిజిటల్‌మీడియాలో వస్తున్న వార్తా కథనాలపై నిజానిజాలు తెలుసుకునేందుకు విచారణ చేస్తున్నామని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, మీడియాలో వస్తున్న కథనాలపై చట్టప్రకారం పరిశీలించి అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ జరిపి పైఅధికారులకు రిపోర్టు చేస్తామన్నారు. దీనిలో భాగంగా బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేశామన్నారు.

శ్రీరంగపట్నం సొసైటీ చైర్మన్‌గా వీరబాబు



కోరుకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగపట్నం, కోటి, గరగలంపాలెం, బొల్లేద్దుపాలెం, రాఘవాపురం, కోటికేశవరం గ్రామాల పరిధిలోని శ్రీరంగపట్నం సహకార సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కోటి గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి అడపా వీరబాబు నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం వీరబాబుకు సమాచారం అందించారు.సభ్యులుగా కొయిడాల వెంకటరమణ, దొడ్డి మంగ నియమితులయ్యారు.

జనసేనలో చేరికలు

కోరుకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సుబ్బారావు, ఫిషర్‌మెన్ సొసైటీ మాజీ అధ్యక్షుడు కారు వెంకట రామకృష్ణ, వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు బుధవారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ కోరుకొండలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కొబ్బరిలో సాంకేతిక సామర్థ్య వృద్ధిపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ టొబాకో రీసెర్చ్ స్టేషన్‌లో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఏపీ ఉద్యానవన శాఖ సౌజన్యంతో కొబ్బరి రైతుల కోసం సాంకేతిక సామర్థ్య వృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మంజునాథరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎస్.మల్లికార్జునరావు, మైక్రో ఇరిగేషన్ అధికారి దుర్గేష్, కోకోనట్ డెవలప్‌మెంట్ అధికారి శరత్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ కిరీటి, డాక్టర్ నీరజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోకో బోర్డు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, నాటు విత్తన వెరైటీల సమాచారం, నారుమడుల తయారీ, ఇన్సూరెన్స్, సాగు పద్ధతులను వివరించారు. ఐసీఏఆర్ డైరెక్టర్ శేష మాధవ్ మాట్లాడుతూ కొబ్బరిచెట్టు కల్పవృక్షంగా పిలవడానికి గల కారణాలను తెలియజేశారు. కార్యక్రమంలో కోరుకొండ, మోరంపూడి, కడియం, రాజానగరం, దేవరపల్లి, కొవ్వూరు మండలాల ఉద్యానవన అధికారులు, విస్తరణ అధికారులు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

రాజానగరంలో బంగారు వరలక్ష్మి కానుక లక్కీడ్రా

200 మందికి బంగారు రూపులు

రాజానగరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మహిళా మణుల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. రాజానగరంలోని మాధవి ఫంక్షన్ హాల్లో బుధవారం చేపట్టిన బంగారు వరలక్ష్మి కానుక లక్కీ డ్రా కార్యక్రమం నిర్వహించారు. లక్కీ డ్రాలో గెలుపొందిన 200 మంది మహిళలకు బంగారు వరలక్ష్మి రూపులను శ్రీనివాసరావు దంపతులు ఉచితంగా అందజేశారు.అలాగే డ్రాలో గెలుపొందని ముగ్గురు దివ్యాంగులకు బంగారు రూపులను అందజేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు బత్తుల నానాజీ, ఉంగరాల మణిరత్నం, ఆళ్ల శివ నాగరాజు, దొడ్డా అర్జున్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రేడులో తల్లిపాల వారోత్సవాలు

రంగంపేట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలం లోని చంద్రేడు గ్రామంలోని అంగన్‌వాడీ 1,2, కేంద్రాల్లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌వీ రమణాంజలి మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు రక్షణ కవచం వంటివని, చిన్నారుల అభివృద్ధికి అవి ఎంత ముఖ్యమో తెలియజేశారు.అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరంలోని రాజేంద్రనగర్ సచివాలయంలో జీఎస్ఎల్ నర్సింగ్ కాలేజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గీత ప్రవీణ మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని, బిడ్డ పుట్టిన అరగంటలో తల్లి పాలు పడితే జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం రాజేంద్రనగర్ పన్నెండు పంపుల సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి ప్రసాద్, బళ్లా శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.విజయ పల్లవి, పీవో జి.మాలిని, శాంతిప్రియ, డీడీ భవాని, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి టీచర్లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తంటికొండ వెంకన్న ఆలయ హుండీ లెక్కింపు

ఆదాయం రూ.9,33,861

గోకవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరిపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఆలయ హుండీని అధికారులు లెక్కించారు. గత ఆరు నెలల 16 రోజులకుగాను స్వామి వారికి రూ.9,33,861 ఆదాయం వచ్చినట్టు ఆలయ కమిటీ చైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర తెలిపారు. హుండీ లెక్కించే సమయంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చదువుపై ఏకాగ్రత ఉంచాలి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్యమురళి



విద్యార్థులకు బహుమతులు అందజేసిన చైతన్యమురళి

బిక్కవోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ చదువుపై ఏకాగ్రత ఉంచినప్పుడే చదివిన విషయాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.చైతన్యమురళి సూచించారు. మండలంలోని ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మత్తు పదార్థాలు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.బాల్య వివాహాలను నిర్మూలించాలన్నారు. అనంతరం వ్యక్తిత్వ వికాసం, పర్యావరణంపై పలు ప్రశ్నలు అడిగి జవాబులు చెప్పిన విద్యార్థులకు ఆయన బహుమతులందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వెంట రంగంపేట ఎక్సైజ్ సీఐ సుధ, హెచ్ఎం పప్పు శ్రీనివాసరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ తమలంపూడి ఈశ్వరరెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నానో ఎరువుల వాడకంపై ప్రదర్శన క్షేత్రాలు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తరకం ఎరువులయిన నానో యూరియా, నానో డీఏపీలను రైతులతో అధిక మొత్తంలో వాడించడానికి ప్రతి మండలంలో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో జిల్లాలోని వ్యవసాయాధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నానో యూరియా 500 ఎంఎల్, నానో డీఏపీ 500 ఎంఎల్, ఒక ఎకరా వరి పంటకు సరిపోతుందన్నారు. నానో ఎరువుల వాడకం వల్ల 20శాతం రసాయనిక ఎరువులను తగ్గించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులందరికీ ఎరువులు సరఫరా జరిగేటట్టు చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకంలో ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ కాకపోతే తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న వ్యవసాయ శకటాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు వ్యవసాయ ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం, కోరుకొండ, అనపర్తి, కొవ్వూరు, వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, జయరామలక్ష్మి, డీవీ కృష్ణ, సీహెచ్ శ్రీనివాసరావు, ఏవోలు భామరాజు, సూర్యరమేష్, ప్రశాంతి, శాంత ఆలివ్, ద్రాక్షాయణి, ప్రకృతి వ్యవసాయాధికారులు వల్లి, గౌతమ్, విస్తరణాధికారులు పాల్గొన్నారు.

పార్వతిదేవికి సారె

బిక్కవోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతిదేవికి బుధవారం గ్రామస్థులు సారె సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, స్వీట్లతో స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయం నుంచి అమ్మవారికి గ్రామోత్సవం జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి గాజులతో అలంకరించారు. సారెను గ్రామంలో ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



గాజుల అలంకారంలో పార్వతి అమ్మవారు

విద్యుదాఘాతంతో వ్యక్తిమృతి

కోరుకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురపూడిలో తోటల మధ్య విద్యుత్ తీగ తగిలి ఆ దారిన వెళుతున్న రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు గ్రామానికి చెందిన గ్రంధి శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కోరుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బూరుగుపూడిలో పారిశుధ్య పనులు

కోరుకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడిలో ముమ్మర పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్ చెప్పారు. శుభ్రత కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, మంచినీటి కుళాయిలు, ట్యాంకుల వద్ద, ముఖ్య కూడళ్ల శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లుతున్నామన్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులు వల్ల డెంగ్యూ, కలరా మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా ఈ చర్యలు చేపట్టామన్నారు.

వెదుళ్లపల్లి సొసైటీకి తాళాలు

సీతానగరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వెదుళ్లపల్లి సొసైటీకి రైతులు తాళాలు వేశారు. దీంతో జిల్లా రిజిస్ట్రారు కనక దుర్గారెడ్డి, పర్సన్ ఇన్‌చార్జి ఎం.కృష్ణమోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రారు మధుబాబు, సీఈవో ఎం.శివరామకుమారి సొసైటీకి వచ్చారు. తాళం తీయాలని ఎరువులు, రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తెలపడంతో రైతులు సొసైటీ తాళం తీశారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సార్ మేడమ్
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలస్	: కింగ్‌డమ్
స్వామి	: హరిహర వీరమల్లు
అనుశ్రీ(సాయికృష్ణ)	: హరిహర వీరమల్లు
శివజ్యోతి	: సార్ మేడమ్
రాజా	: కింగ్‌డమ్
ఊర్వశి	: మహావతార్ నరసింహ
మేనక	: సన్ ఆఫ్ సర్దార్-2
రంభ	: జూనియర్
కుమారి	: ----
అప్సర	: కింగ్‌డమ్
అశోక	: కింగ్‌డమ్
పీఎస్ మహల్(నామవరం)	: కింగ్‌డమ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కింగ్‌డమ్
వెంకటసూర్య(కడియం)	: కింగ్‌డమ్
సత్యగౌరి (అనపర్తి)	: మహావతార్ నరసింహ
సూర్యశ్రీ (అనపర్తి)	: హరిహర వీరమల్లు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కింగ్‌డమ్
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కింగ్‌డమ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: మహావతార్ నరసింహ
లలితామహల్(రంపచోడవరం)	: హరిహర వీరమల్లు
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు

'సంక్షేమ' జల్లు!

- రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో వివిధ వర్గాలపై వరాల జల్లు
- మహిళలు, నాయీబ్రాహ్మణులు, చేనేత, కల్లుగీత కార్మికులకు బొనాంజా
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై పూర్తిస్థాయి స్పష్టత
- సెలూన్లకు ఉచిత విద్యుత్ 200 యూనిట్లకు పెంపుతో హర్షం
- చేనేత కార్మికులకు ఒకేసారి ఉచిత విద్యుత్, జీఎస్టీ చెల్లింపు, త్రిఫ్ట్ పథకాలు
- అటు కొత్త బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11వరకు తెరుచుకునే ఛాన్స్

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పలు కీలక నిర్ణయాలు ప్రకటించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు బడుగు, బలహీనవర్గాలకు ఆర్థికంగా మరింత తోడ్పాటునందించేలా వరాల జల్లు కురిపించింది. మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, నాయీబ్రాహ్మణులు ఇలా అనేక వర్గాలకు ఊరటనిచ్చే పలు కీలక నిర్ణయాలను ప్రకటించింది. తద్వారా ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన అనేక హామీలు అమలుచేసేలా క్యాబినెట్ నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగా ఆగస్టు 15 నుంచి అమలుకానున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై మంత్రి మండలి పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చింది. మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడకు ఏయే బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చనేదానిపై కీలక నిర్ణయాలు ప్రకటించింది. రాష్ట్రానికి చెందిన మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రకటించింది. పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణానికి ప్రభుత్వం అనుమతించింది. ఉచిత సౌకర్యం వినియోగించుకునేందుకు ఆధార్, ఓటర్, రేషన్‌కార్డుల్లో ఏదొకటి చూపిస్తే చాలని స్పష్టత ఇచ్చింది. అలాగే ఉచిత బస్సు పథకం నాన్‌స్టాప్, అంతర్ రాష్ట్రీయ బస్సు సర్వీసులు, లేదా ఇతర ఏ కేటగిరీలకు వర్తించదని పేర్కొంది. పథకం అమలుకు నెలకు రాష్ట్రవ్యాప్తంగా రూ.162 కోట్ల వరకు ఖర్చవుతుండగా, ఉమ్మడి జిల్లాలో రూ.16 కోట్ల వరకు ప్రభుత్వంపై భారం పడనుంది. మరోపక్క ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రద్దీ పెరగనున్నందున మహిళల భద్రత కోసం బస్సు లోపల సీసీ కెమెరాలు, మహిళా కండక్టర్లకు బాడీ వార్న్ కెమెరాలు ఇవ్వనున్నట్టు క్యాబినెట్ వెల్లడించింది. అందులో భాగంగా పథకం అమలుకోసం ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో దాదాపు 600 బస్సులను సిద్ధం చేస్తున్నారు. అలాగే అన్ని బస్సు డిపోల్లో ప్రయాణికుల కోసం ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం కూడా కల్పించడానికి క్యాబినెట్ నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో అనేక బస్టాండ్ల రూపురేఖలు మారనున్నాయి. ప్రస్తుతం హెయిర్ కటింగ్ సెలూన్లకు అమలవుతున్న 150 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు అయితే ప్రభుత్వం బొనాంజా ప్రకటించింది. ఒకేసారి మూడు పథకాలకు ఆమోదం తెలిపింది. మగ్గాలకు ఉచిత విద్యుత్, చేనేత విక్రయాలపై జీఎస్టీ రద్దు, త్రిఫ్ట్ ఫండ్ పథకం ప్రారంభించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ వల్ల ఉమ్మడి జిల్లాలో 6,548మందికి రూ.3.92కోట్ల లబ్ధిచేకూరనుంది. అలాగే చేనేత ఉత్పత్తులపై చెల్లించే జీఎస్టీని ప్రభుత్వం నేతన్నలకు తిరిగి చెల్లించాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం నేతన్నల్లో సంతోషం మిన్నంటేలా చేస్తోంది. దీంతో కాకినాడ జిల్లాలో 23 సంఘాలకు రూ.12 లక్షలు, కోనసీమ, తూ.గో జిల్లాల్లో నేతన్నలకు రూ.75లక్షల వరకు లబ్ధి చేకూరనుంది. ఇక ఈనెలతో ముగియనున్న పాత బార్ లైసెన్సుల నేపథ్యంలో వచ్చే నెల ఒకటి నుంచి ప్రారంభం కానున్న కొత్త బార్లకు సంబంధించి విధివిధానాలను క్యాబినెట్ వెల్లడించింది. కొత్త బార్లు ఇకపై ఉదయం పది నుంచి రాత్రి 11వరకు తెరవడానికి అనుమతించింది. అలాగే కల్లుగీత కార్మికులకు బార్ ఫీజులో యాభై శాతం తగ్గింపుతో కల్లు గీత కార్మికులకు తీపి కబురు అందించింది.





ఎరుపెక్కిన రాజమహేంద్రి

సుబ్రహ్మణ్య మైదానంలో సీపీఐ జిల్లా 26వ మహాసభలు ప్రారంభం

హాజరైన రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

8

రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన సీపీఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ.. హాజరైన జనం



కదలరు.. వదలరు

- పోలవరంలో ఏళ్ల తరబడి ఆ ఇంజనీర్లే తిష్ఠ
- అదే ప్రాజెక్టులో వేరే డివిజన్‌కు బదిలీ అయినా పని జరిగే డివిజన్‌లోకి చొరబాటు
- ప్రస్తుతం డయాఫ్రంవాల్, ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులకే డిమాండ్
- పోలవరం ప్రాజెక్టులో 8 డివిజన్లు
- కొన్ని డివిజన్లలో ఈగల మోతే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మకమైన పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టులో మొదట నుంచి కొందరు అధికారులే తిష్ఠవేశారనే విమర్శలు వస్తున్నాయి. కొందరు ఇంజనీర్లు ఆయా కాంట్రాక్టు కంపెనీలు, ప్రజాప్రతినిధులతో సిండికేట్‌గా మారి ఏదో విధంగా ఇదే ప్రాజెక్టులో పని జరిగే డివిజన్‌లోనే ఉండేటట్టు చేసుకోవడం పలు విమర్శలకు తావిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరించిన అధికారులు ఇక్కడ పని చేస్తుండడం గమనార్హం. కొందరికి పదోన్నతులు వచ్చాయి. పలువురు ఇక్కడి నుంచి వేరే డివి జన్‌కు బదిలీ అయినా కూడా డైవర్షన్ పేరుతో తిరిగి పనిజరిగే డివిజన్‌లోనే పనిచేయడం గమనార్హం. కొద్దినెలల ముందు జరిగిన బదిలీల్లో ఐదేళ్లు నిండకుండానే సుమారు 10 మంది ఏఈలను ప్రాధాన్యత లేని డివిజన్లకు పంపించి, పాతవారే కొందరు రావడం గమనార్హం. మరో ముగ్గురు వేరేచోటకు బదిలీ అయి కూడా డైవర్షన్ మీద ఇక్కడే పని చేస్తున్నారు. ఒకాయన ఎక్కువ కాలం పనిచేసి మళ్లీ ఇక్కడి క్వాల్టీ కంట్రోలు ఈఈగా రావాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇటీవల కొందరు జలవనరుల శాఖ ఉన్నతాధికారికి వివరంగా ఒక లేఖ రాసినట్టు సమాచారం. పోలవరం ప్రాజెక్టులో మొత్తం 8 డివిజన్లు ఉన్నాయి. 1వ డివిజన్‌లో స్పిల్‌వే కన్‌స్ట్రక్షన్, 2వ డివిజన్‌లో కుడి ప్రధాన కాలువ కనెక్టివిటీ అంటే పోలవరం ప్రాజెక్టుకు కుడిప్రధాన కాలువ(ఆర్ఎంసీ)ని కలపడం. కొండలు తొలిచి, టన్నెళ్లు వంటివి నిర్మించి ప్రాజెక్టుతో కాలువను అనుసంధానం చేయడం ఈ డివిజన్‌లోని ఇంజనీర్ల పని. మూడో డివిజన్‌లో అతి ముఖ్యమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్(ఈసీఆర్ఎఫ్). ఇక్కడే డయాఫ్రంవాల్, గైడ్ బండ్ వంటి పనులు ఉంటాయి. మొత్తం ఈ పనులనే ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1, గ్యాప్-2 అంటారు. నాల్గో డివిజన్‌లో స్పిల్‌వే 48 గేట్లు బిగించడం, వాటి పర్యవేక్షణ ఉంటుంది. 5వ డివిజన్‌లో ఎడమ ప్రధాన కాలువ(ఎల్ఎంసి) కనెక్టివిటీ పనులు ఉన్నాయి. 6వ డివిజన్‌లో పవర్ హౌస్ నిర్మాణం ఉంది. మట్టి పనులు వరకూ ఇరిగేషన్ ఇంజనీర్లు చేశారు. ప్రస్తుతం జెన్‌కో పని ఉంది. ఇక్కడ కూడా తక్కువ పని ఉన్నట్టే లెక్క. 7, 8 డివిజన్లలో భూసేకరణ పనులు ఉన్నాయి. ఇవి కాకుండా క్వాలిటీ కంట్రోలు డివిజన్‌లో ప్రత్యేకంగా ఉంటుంది. ఇది ధవళేశ్వరంలో ఉంటుంది. దీని పరిధిలో సబ్ - డివిజన్లు కూడా ఉంటాయి. తెలివైన, పట్టు ఉన్న అధికారులంతా పని ఉన్న డివిజన్లతో పాటు క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌లో పని చేయడానికి మోజు పడుతుంటారు. దీని పరమార్థం అందరికీ తెలిసిందే. మొదటి దశకు సంబంధించిన సుమారుగా భూసేకరణ పూర్తయింది. ఒక్కో డివిజన్‌లో ఈఈ. పలువురు డీఈలు, ఏఈలు ఉంటారు. ఇక ఇప్పటికే 1వ డివిజన్‌లో స్పిల్‌వే పనులు పూర్తయ్యాయి. 2వ డివిజన్ పనులు సుమారుగా పూర్తయ్యాయి. మూడో డివిజన్‌లోనే అతి ముఖ్యమైన ఈసీఆర్ఎఫ్ (డయాఫ్రంవాల్ నిర్మించి, దానిమీద ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మిస్తారు). 4వ డివిజన్‌లో పోలవరం ప్రాజెక్ట్ (పీపీఏ) భవనం నిర్మాణం ఒకటి జరుగుతుంది. మిగతా పనులన్నీ పూర్తయినట్టే. 5వ డివిజన్‌లో పనులు ఇప్పుడే మొదలయ్యాయి. ప్రస్తుతం డిమాండ్ అంతా 3వ డివిజన్ తర్వాత కొద్దిగా 5వ డివిజన్ మీదే ఉంది. చాలాకాలం నుంచి తిష్ఠవేసిన అధికారులు మళ్లీ డివిజన్లలోకి రావడం గమనార్హం. కొందరు ఐదేళ్ల తర్వాత బదిలీ అయి, ఉన్నతాధికారులు లేదా, కాంట్రాక్టు ఏజన్సీతో సన్నిహితంగా ఉంటూ డైవర్షన్ మీద ఎక్కువ పనిఉన్న డివిజన్‌కు వచ్చేశారు. ప్రస్తుతం భూసేకరణకు సంబంధించిన 7,8 డివిజన్లలో అధికారులంతా ఇంచుమించు ఖాళీగా ఉన్నారు. ప్రస్తుతం ఈసీఆర్ఎఫ్ గ్యాప్ పనుల్లో పాత ఇంజనీర్లే ఎక్కువ మంది ఉండడం గమనార్హం. క్వాలిటీ కంట్రోలులో ఈఈగా ఉన్న ఓ ఇంజనీరుకు ఇటీవల హైదరాబాద్‌లోని కేఆర్ఎంబీకి బదిలీ అయింది. ఆయన స్థానంలో రావడానికి 4వ డివిజన్‌లో పనిచేస్తున్న ప్రేమ్‌చంద్ అనే ఇంజనీరు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈయన సుమారు 16 ఏళ్లపాటు వివిధ డివిజన్లలోనే తిరుగున్నట్టు ఆరోపణ ఉంది. డీఈఈ కె. శివప్రసాద్ 10 ఏళ్ల నుంచి, ఈఈ కె.సుబ్రహ్మణ్యం 12 ఏళ్ల నుంచి, ఏఈఈ ఎ.అరుణ్‌మహేంద్ర 12 ఏళ్ల నుంచి ఏఈఈ ఏవీకేడీఎస్ స్వామి పదేళ్ల నుంచి, జీవి దుర్గా ప్రసాద్ పదేళ్ల నుంచి ఈ ప్రాజెక్టులోనే ఉన్నట్టు విమర్శలు ఉన్నాయి. ఈఈ డి.శ్రీనివాస్ సుమారు 16 ఏళ్లుగా ప్రాజెక్టు పరిధిలోనే చక్కర్లు కొడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ఎస్ఈ నుంచి ఈఎన్‌సీ స్థాయికి ఎదిగిన ఓ అధికారి వైసీపీ హయాంలో గోదావరిలో డ్రెడ్జింగ్ కాంట్రాక్టు అర్హత లేని కంపెనీకి అప్పగించడంతో కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.



కొవ్వూరులో 2019 నాటి 34 రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలి

- బీజేపీ నాయకులు, రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు రైల్వే జీఎంకు వినతి
- నిడదవోలు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై రైల్వే జీఎం అసహనం

8

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ : కలెక్టర్

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం సిటీ 50 అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా బుధవారం కలెక్టర్ ప్రశాంతి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాజమహేంద్రవరం సిటీ పరిధిలో ప్రస్తుతం 241 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని, హేతుబద్ధీకరణలో భాగంగా వాటిని పరిశీలించి 5 కేంద్రాల ప్రదేశ మార్పు, 22 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, 62 కేంద్రాల విలీనం లేదా తొలగింపు వంటి మార్పులు చేపట్టామన్నారు. మొత్తం 263 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించామన్నారు. కలెక్టర్ వెంట అర్బన్ తహశీల్దారు పాపారావు పాల్గొన్నారు.

అకిరా మియావాకీతో అడవులను సృష్టించవచ్చు

కలెక్టర్ ప్రశాంతి




అకిరా మియావాకీ పద్ధతిని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అకిరా మియావాకీ పద్ధతితో తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచడంతోపాటు దట్టమైన చిట్టడవులను సృష్టించవచ్చని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం చెంతన 25 సెంట్ల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన అకిరా మియావాకి మొక్కల పెంపకం ప్రదేశాన్ని, పామ్ పాంట్, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అకిరా మియావాకి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా అకిరా మియావాకి మొక్కల పెంపకం ఒక వినూత్న ఆలోచనా మార్గమన్నారు. సరైన వాతావరణంలో మొక్కల పెంపకం చేపట్టడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. రాజానగరం ప్రాంతంలో మొక్కల ఎదుగుదల తీరును పరిశీలించి సంతృప్తివ్యక్తం చేశారు. నీటి నిల్వల సామర్థ్యం పెంచేలా పామ్ పాంట్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అలాగే లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానం అమల్లోనూ మరింత సమర్థతను తీసుకురావాలన్నారు. పరిధిని పెంచి నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని అధికారులకు సూచించారు. పొలం గట్ల మీద కూడా మొక్కల పెంపకం కోసం దృష్టి పెట్టాలన్నారు. మియావాకి పద్ధతిలో మొత్తం 2,970 మొక్కలు నాటడం జరిగిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నాటిన మొక్కల్లో జామి, వెంగం, బిల్లా, మర్రి, నర్ర, గిలగిల,వద్ది చెట్టు, తామర, మందార, దేవదారు, తులసి, వేప, గంధ తగర వంటి వివిధ రకాల మొక్కలు ఉన్నాయి. ఈ సందర్భంగా సందర్శకుల రిజిస్టర్‌లో క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది పనితీరును ప్రశంసిస్తూ వివరాలను కలెక్టర్ స్వయంగా నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవి, డ్వామా ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో నేరపూరిత పనులు

మయన్మార్ నుంచి యువకుడిని క్షేమంగా రప్పించిన పోలీసులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం ఏడారి దేశం వెళ్లాడు. తీరా అక్కడికి వెళ్లాక తెలిసింది.. అది సైబర్ నేరాలు చేసే కొలువని. ఆరు పదుల జీతం.. దోపిడీ సొమ్ములో పది శాతం వాటా. కానీ ఆ యువకుడికి మనస్కరించలేదు. చట్టాన్ని ఉల్లంఘిస్తున్నామని ఆవేదన చెందాడు. ఇదే విషయాన్ని ఇక్కడ ఉన్న ఆమె తల్లికి చెప్పగా.. ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు.. అతడిని సురక్షితంగా భారత్‌కి రప్పించారు. అక్రమంగా వచ్చే సంపాదనను వద్దనుకొని నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన ఆ యువకుడిని ఎస్పీ సత్కరించారు. పెరవలి మండలం కానూరుకు చెందిన శ్యామ్ కుమార్ మెకానికల్ డిప్లొమా చదువుకున్నాడు. ఉద్యోగం లేకపోవడం, ఇల్లు గడవకపోవడంతో గల్ఫ్ వెళ్లాలని అనుకున్నాడు. ఒక ఏజెంటుకు రూ.లక్ష చెల్లించి రెండు నెలల కిందట బహ్రెయిన్ తీసుకెళ్లాడు. అక్కడ కొద్ది రోజులు గడిచాక అంతర్జాతీయ సరిహద్దును అక్రమంగా దాటించి కారులో మయన్మార్ తీసుకెళ్లారు. అతడు చేయాల్సి ఉద్యోగాన్ని అక్కడ వివరించారు. సైబర్ నేరాలే వ్యాపారంగా చైనీయులు నెలకొల్పి నడుపుతున్న కంపెనీలు అక్కడ విచ్చలవిడిగా ఉంటాయి. వాటిలోని ఓ కంపెనీలో శ్యామ్‌ను జాయిన్ చేశారు. పాస్‌పోర్టును తీసేసుకున్నారు. భారత్ నుంచి అమెరికా వెళ్లి స్థిరపడి, గ్రీన్‌కార్డు కలిగిన వ్యక్తులతో పరిచయం చేసుకొని వివరాలను సేకరించడం ఉద్యోగం. ఆ వివరాలను కంపెనీ వాళ్లకు ఇస్తే సైబర్ నేరం ద్వారా డబ్బును దోపిడీ చేస్తారు. రూ.60 వేల (భారత కరెన్సీలో) జీతంతోపాటు దోపిడీ సొమ్ములో వాటా కూడా ఇస్తారు. నెలకు ఇంత మంది అని లక్ష్యాలను విధిస్తారు. దీని కోసం ఫేక్‌ఫొటో, వివరాలతో శ్యామ్‌కు ఇన్‌స్టా తదితర ప్లాట్‌ఫాంలలో ఖాతాలు తెరుస్తారు. అయితే ఇదంతా నేరమని, తనను భారత్‌కి పంపించేయాలని ఏజెంట్లకు చెప్పగా.. రూ.4 లక్షలు చెల్లిస్తే పంపిస్తామన్నారు. అదే విషయం ఇక్కడ ఉన్న తల్లితో చెప్పడంతో అప్పుడు చేసి రూ.2.50 లక్షలు పంపించారు. ఇంకా డబ్బు పంపాలని డిమాండ్ చేయడంతో ఆమె ఎస్పీ కార్యాలయంలో రెండు వారాల కిందట పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాలతో నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ ఆ కంపెనీ ప్రతినిధులు, ఏజెంటుతో చాకచక్యంగా మాట్లాడితే శ్యామ్‌ని పంపడానికి ఒప్పుకున్నారు. ఆ మేరకు భారత్‌కి చేరుకున్నాడు. తనకు మాదిరిగానే ఎందరో ఆ కూపంలో చిక్కుకొని, ఇంటికి వద్దామంటే అప్పులు కంటి ముందు కనబడి రోజూ ఏడుస్తూ బతుకుతున్నారని శ్యామ్ చెబుతున్నాడు. టూరిస్టు తదితర స్వల్పకాలిక పరిమితి వీసాలపై తీసుకెళ్లి గడువు ముగిసినా పంపించకుండా ఉద్యోగం చేయించుకుంటున్నారని తెలిపాడు. ఎందరో ఈ ఊబిలో చిక్కుతున్నారని, కేంద్రం దృష్టి సారిస్తే సైబర్ నేరాలు కూడా తగ్గుతాయంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఎస్పీ ఆదేశించారు.



యువకుడిని సత్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

వినరే గణేశా!





రాజమహేంద్రవరంలో తయారవుతున్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో హాని
- ఇప్పటికే టన్నుల పీఓపీతో వందలాది వినాయకుడి విగ్రహాలు సిద్ధం
- పశ్చిమబెంగాల్ కార్మికులతో ఇక్కడ తయారీ
- ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం.. పీఓపీ సంగతేంటి?

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

భస్మాసురుడు తన నెత్తిపై తానే చెయ్యి పెట్టుకొని భస్మమైపోయినట్టు.. మరీ అంత కాకపోయినా.. నెమ్మదిగా మనకు మనమే నాశనమైపోయే పనులను మాత్రం వీడడం లేదు. ముఖ్యంగా పండుగల మాటున కాలుష్యాన్ని కోరి మరీ కొనుక్కొని తెచ్చుకొని పదిమందికి రోగాలు పంచుతున్నాం. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయకుడి ప్రతిమలు ప్రతి ఏడాది జల కాలుష్యానికి కారణమవుతూనే ఉన్నాయి. ఈనెల 27న వినాయక చవితి సందర్భంగా ఇప్పటికే టన్నుల పీఓపీతో వందలాది విగ్రహాలను తయారు చేసేస్తున్నారు. అసలే ప్రమాదకరమైన పని చేస్తున్నారంటూ పర్యావరణవేత్తలు గోల పెడుతున్నా.. ఒకరిని మించి మరొకరు భారీ విగ్రహాలను మండపాల్లో కొలువు దీరుస్తున్నారు. ఈ ఏడాది కూడా ఉమ్మడి జిల్లాలో వేగంగా భారీ విగ్రహాల తయారీ జరుగుతోంది.

పీఓపీతో ప్రమాదం

పీఓపీ నీటిలో కరగదు. మట్టిలో కలవదు. అగ్గిలో దహనం కాదు. నీటిని కలుషితం చేస్తుంది. ప్రవాహానికి అడ్డుగా నిలుస్తుంది. దీంతో నీటిలోని జీవవైవిధ్యం దెబ్బతింటుంది. విగ్రహాల తయారీకి ఉపయోగించే పీఓపీ(కాల్షియం సల్ఫేట్ హెమీహైడ్రేట్) విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల ఆ నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోతుంది. పీఓపీలో ప్రధానంగా జిప్సంని ముడి పదార్థంగా వాడతారు. ఇది ప్రమాదకర రసాయం. ఇలా పీఓపీ కలిసిన నీటిని ఉపయోగించే మనుషులు, పశువులు డయేరియా, కడుపు నొప్పి, చర్మవాధుల బారినపడతారు. క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆర్సెనిక్ వల్ల జుట్టు రాలిపోతుంది. సీసం వల్ల శరీరం పటుత్వం తప్పుతుంది. ఈ నీళ్లు పొలాలకు వెళ్లడం వల్ల భూసారం తగ్గి భూమి సహజ స్వభావాన్ని కోల్పోతుంది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో 2016లోనే పలు రాష్ట్రాలు పీఓపీ విగ్రహాల తయారీపై నిషేధం విధించాయి. కానీ సరైన అవగాహన తీసుకురావడంతో యంత్రాంగం చతికిల బడడంతో ప్రతి ఏటా వేలల్లో విగ్రహాలు తయారు అవుతూనే ఉన్నాయి. కాలుష్య నియంత్రణ మండలి ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో చాలా వెనుకబడి ఉంది.

గత ఏడాది 15వేల విగ్రహాలు

ప్రతి ఏడాది వినాయక చవితి వస్తూండడంతోనే.. సహస రంగులతో తయారు చేసే మట్టి వినాయకుడి విగ్రహాలనే వినియోగించి పర్యావరణ హితవుకు పాటుబడాలని ఎంత చెప్పినా ఫలితం శూన్యంగా కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి విగ్రహాల తయారీదారులను స్థానిక కాంట్రాక్టర్లు తీసుకొచ్చి మరీ తయారు చేయిస్తున్నారు. అడుగు నుంచి 10 అడుగులపై వరకూ విగ్రహాలను తయారు చేస్తున్నారు. విగ్రహాలను కచ్చితంగా నిమజ్జనం చేస్తారు. దీంతో జల వనరులు కలుషితం అవుతున్నాయి. ఇలా ప్రతి ఏడాదీ ఒక తంతుగా జరిగిపోతోంది. నీటిని కలుషితం చేయడం చట్ట ప్రకారం నేరమే అయినా కాలుష్య నియంత్రణ మండలి పట్టించుకోదు. గతేడాది తూర్పు గోదావరి 1760 వినాయక ఉత్సవ కమిటీలు పోలీసుల వద్ద నమోదు చేసుకున్నాయి. రికార్డులకు ఎక్కనివి వేలల్లో ఉంటాయన్నది తెలిసిందే.

● చైతన్యం తీసుకురావాలి

పీఓపీతో తయారు చేసిన ప్రతిమలను పూజించడం వరకూ ఎలా ఉన్నా.. నీటిలో నిమజ్జనం చేయడం వల్ల కలిగే దుష్పరిమాణాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం తక్షణ అవసరం. జిల్లాలో ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం నిలిపివేతపై కలెక్టర్ ప్రశాంతి పర్యవేక్షణలో ఉద్యమమే నడుస్తోంది. ఆ స్ఫూర్తి పీఓపీపై కూడా ఉండాల్సిన అవసరం ఉంది. మరోవైపు కోర్టులు సైతం పీఓపీ విగ్రహాలను జల వనరుల్లో నిమజ్జనం చేయడంపై కన్నెర్ర చేస్తున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను కృత్రిమంగా ఏర్పాటుచేసే ట్యాంకుల్లోనే నిమజ్జనం చేయాలని బాంబే హైకోర్టు గత నెల 24న ఆదేశించింది. పీఓపీ విగ్రహాలను వీడి మట్టి వినాయకుడిని పూజించే విధంగా యంత్రాంగం దృష్టి పెట్టాల్సి ఉంది.

కొవ్వూరులో 2019 నాటి 34 రైళ్ల హాల్టులను
పునరుద్ధరించాలి

● రైల్వే జీఎంకు బీజేపీ నాయకులు, రైల్వే పరిరక్షణ సమితి సభ్యుల వినతి



దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవను కొవ్వూరులో కలిసి మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నాయకులు



నిడదవోలులో రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న రైల్వే జీఎం శ్రీవాస్తవ

కొవ్వూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో 2019 నాటి 34రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని రైల్వే జీఎం శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేశారు. కొవ్వూరు రైల్వే స్టేషన్‌ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ బుధవారం పరిశీలించారు. ప్రత్యేక రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు చేరుకున్నారు. స్టేషన్ ప్రాంగణాన్ని, ప్లాట్‌ఫారంలను పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ప్రత్యేక రైలులో నిడదవోలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రద్దు చేసిన 2019 నాటి రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని బీజేపీ నాయకులు, రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు రైల్వే జీఎంను కోరారు. కొవ్వూరుస్టేషన్‌లో రైళ్ల హాల్ట్ లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను రైల్వే జీఎంకు వివరించారు. సుమారు 3 నియోజకవర్గాల్లో 110 గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 34 రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. శ్రీవాత్సవను సమితి సభ్యులు శాలువాతో సత్కరించారు. దీనిపై శ్రీవాత్సవ సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, నాయకులు బోడపాటి ముత్యాలరావు, బూసి సురేంద్రనాథ్ బెనర్జి, డేగల సునీత, ఇందుగుల రామకృష్ణ, తురగా విజయభాస్కర్, పరిరక్షణ సమితి సభ్యులు విల్సన్‌రాజు, జి.రామ్మోహనరావు, శ్రీనివాస్, కె.సాంబయ్య, పాల్గొన్నారు.

నిడదవోలు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై రైల్వే జీఎం అసహనం

నిడదవోలు: నిడదవోలు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు నాణ్యతతో వేగవంతంగా జరగాలని, ఆశించిన స్థాయిలో పనులు జరగడంలేదని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం నిడదవోలులోని రైల్వేజంక్షన్‌లో అమృత భారత్ నిధులతో జరుగుతున్న ఆధునికీకరణ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆశించినస్థాయిలో పనులు సంతృప్తికరంగా సాగడంలేదని ఇక నుంచి ప్రతీవారం జరిగిన పనులు తనకు ఫోటోలు తీసి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల సౌకర్యార్థం జరుగుతున్న పనులు నాణ్యతతో వేగవంతంగా జరగాలని అన్నారు. జరుగుతున్న పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. బీజేపీ నాయకులు బండి సత్యనారాయణ, నీలం రామారావులు నిడదవోలు రైల్వేజంక్షన్‌లో సూపర్ ఫాస్ట్‌లకు హాల్ట్ కల్పించాలని వినతిపత్రం అందజేశారు. రైల్వేజనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ వెంట డివిజినల్ రైల్వేమేనేజర్ సోనాలియా, వరుణ్‌బాబు, సూర్యనారాయణ, రవికిషోర్, స్టేషన్‌మాస్టర్ బి.శ్రీరామమూర్తి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రా మన్నపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న రామన్నపా లెం, ధూమంతనగూడెం గ్రామాల్లోని విద్యుత్ వినియోగదా రులకు గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1.30వరకు సరఫరా నిలిపివేస్తామని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు.

నవోదయం 2.0తో సారా రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారిని లావణ్య

కొవ్వూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సారా రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడానికి నవోదయం 2.0 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారిని సీహెచ్.లావణ్య తెలిపారు. సాధారణ తనిఖీలలో భాగంగా బుధవారం కొవ్వూరు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సీఐ జి.సత్యనారాయణ సర్కిల్ పరిధిలో నవోదయం అమలు తీరును వివరించారు. అనంతరం కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ సెప్టెంబరు నెలాఖరు నాటికి రాష్ట్రంలో నాటు సారాను పూర్తిగా నిర్మూలించాలనే ధ్యేయంతో నవోదయం 2.0 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. దానిలో భాగంగా జిల్లాలో 240 నాటుసారా తయారీ గ్రామాలను గుర్తించామన్నారు. వాటిని ఏ,బీ,సీలుగా మూడు విభాగాలుగా విభజించామన్నారు. ఏ గ్రేడ్‌లో నాటుసారా తయారీ గ్రామాలు 30, బి గ్రేడులో తక్కువ మోతాదులో సారా తయారీ, విక్రయాలు జరిగే ప్రాంతాలు 42, సీ గ్రేడులో సారా విక్రయాలు జరిగే ప్రాంతాలు 168 గ్రామాలను గుర్తించామన్నారు.



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారిని లావణ్య

మొత్తం 240 గ్రామాలకుగాను 170 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా డిక్లేర్ చేశామని మిగిలిన గ్రామాలను సెప్టెంబర్ నెలాఖరు నాటికి సారా రహిత జిల్లాగా తూర్పుగోదావరి జిల్లాను, తద్వారా రాష్ట్రాన్ని డిక్లేర్ చేశామన్నారు. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 1016 నాటుసారా కేసులు నమోదుచేసి 921 మందిని అరెస్టు చేశామన్నారు. 13,323లీటర్ల నాటుసారా, 27వేల కేజీల నల్లబెల్లం సీజ్ చేశామని, 4,57,000ల లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశామన్నారు. 96మందిని ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు. గడచిన మూడు నెలల్లో ముగ్గురిపై పీడీ యాక్టు నమోదు చేశామని తెలిపారు. జిల్లాలో 138 మద్యం దుకాణాలకుగాను 13 షాపులను కల్లుగీత కార్మికులకు కేటయించామన్నారు. మద్యం షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు, బార్లు ఉదయం 10నుంచి రాత్రి 11గంటల వరకు మాత్రమే విక్రయాలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు మద్యం దుకాణాలను 3సార్లు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి విజిట్ చేసి సమయపాలన, నిబంధనలు పాటిస్తున్నది లేనిదీ ఎక్సైజ్ ఐ యాప్‌లో నమోదు చేస్తామన్నారు అక్టోబర్‌లో మద్యం పాలసీ వచ్చిన నాటి నుంచి జిల్లాలో 553 బెల్టుషాపులపై కేసులు నమోదుచేసి 563మందిని అరెస్టు చేశామన్నారు. వారివద్ద నుంచి 1800 లీటర్ల మద్యం బాటిల్స్, 250 లీటర్ల బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. గడచిన 6 నెలల్లో గోదావరి లంకలలో దాడులు నిర్వహించి 3 బోట్లు సీజ్ చేశామని, 100కుపైగా డ్రమ్ములను ధ్వంసం చేశామన్నారు. ఎవరైనా నాటుసారా తయారుచేసినా, రవాణాచేసినా, విక్రయించినా ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందజేయాలన్నారు. వీటన్నిటీతోపాటు గత 10 రోజులుగా జిల్లాలో పోలీసు అధికారులతో కలిసి కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలను నిర్వహించి 20 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. జిల్లాలోని రఘునాధపురం, పిడింగొయ్యి, కవలగొయ్యి, సాటిలైట్‌సిటీ, నామవరం, సీతానగరం, కాటవరం, బొబ్బిలిలంక, ములకలలంక గ్రామాలలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టామన్నారు. ఎక్సైజ్ శాఖలో 56శాతం ఉద్యోగుల ఖాళీలు ఉన్నప్పటికీ ఉన్న 44శాతం సిబ్బందితోనే విధు లు నిర్వహిస్తున్నామన్నారు.

కోట సత్తెమ్మకు శ్రావణపట్టీ అందజేత



తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మకి సారె చీర సమర్పించేందుకు వచ్చిన బ్రాహ్మణమిత్ర సేవా సంఘం జిల్లా ప్రతినిధులు

నిడదవోలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి బుధవారం శ్రావణమాసం పురస్కరించుకుని జిల్లా బ్రాహ్మణమిత్ర సేవాసంఘం ఆధ్వర్యంలో నిడదవోలు బ్రాహ్మణ సంఘం అమ్మవారికి వివిధ రకాల పండ్లు, స్వీట్లు, పసుపు కుంకుమ, గాజులు, పువ్వులు శ్రావణ పట్టీ అందించేందుకు మేళతాళాలతో తరలివచ్చారు. దేవస్థానం ఫౌండర్ ఫ్యామిలీమెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్, దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, ఆలయ ప్రధానఅర్చకుడు అప్పారావుశర్మలు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ఈ సంర్భంగా జిల్లా బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ లోక కల్యాణార్థం సనాతనధర్మ పరిరక్షణ కోసం అమ్మవారికి ఈ శ్రావణపట్టీ అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మాదిరాజు శ్రీనివాస్, జోస్యుల సుబ్రహ్మణ్యం, ముదునూరి వాణిశ్రీ, వి.గీతావరలక్ష్మి, నిడదవోలు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివావధాని, కార్యదర్శి కందికొండ లోకభాస్కర్, పొన్నా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి సునీత

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారిని బుధవారం జిల్లా జడ్జి గంధం సునీత దంపతులు దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వారికి దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ అమ్మవారి జ్ఞాపికను అందజేసి వేదాశీర్వచనాలు అందజేశారు.



జిల్లా జడ్జి గంధం సునీత దంపతులకు అమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఆలయ అధికారులు అర్చకులు

చికిత్స పొందుతూ చిరు వ్యాపారి మృతి



దొబ్బడి పెద్దిరాజు(ఫైల్)

నల్లజర్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): దూబచర్ల డైట్ కళాశాలకు వెళ్లే మార్గంలో ఉన్న చిరువ్యాపారి దొబ్బడి పెద్దిరాజు (48) గతనెల 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పెద్దిరాజు దూబచర్లలో 15ఏళ్లుగా ఆర్‌అండ్‌బీ స్థలంలో దుకాణం ఏర్పాటు చేసుకుని కొబ్బరి బొండాలు, చెరుకు రసం విక్రయిస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దుకాణంవద్ద చెట్టు ఉండడంతో కొంతమంది వాహన రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయగా చెట్టుకొమ్మలు నరికి వేయాలని పెద్దిరాజుకు పలుమార్లు చెప్పింది. వినకపోవడంతో పోలీసుల సహాయంతో ఈనెల 30న చెట్టును తొలగించే ప్రయత్నం చేయగా తమ జీవనాధారమైన కొట్టునే తీసేస్తారా అని మనస్తాపంతో దుకాణంలో ఉన్న పురుగుమందును వారి ముందే తాగేశాడు. కుటుంబ సభ్యులు ముందుగా నల్లజర్ల ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పెద్దిరాజుకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దుకాణాల మూసివేత

గ్రామంలోఉన్న పరిస్థితుల దృష్ట్యా పెద్దిరాజు మృతదేహం గ్రామంలోకి వస్తే అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉన్నందున ప్రధానకూడలిలో ఉన్న అన్ని దుకాణాలు మూసివేయించి 144సెక్షన్ అమలు చేసినట్లు సీఐ తెలిపారు

అవుట్‌పోస్టు ఇస్కాన్ ఆలయం ప్రారంభోత్సవం



ఆవిష్కరించిన జగన్నాథ్, బలదేవ్, సుభద్రదేవి విగ్రహాలు, ప్రవచనం చేస్తున్న సత్యగోపీనాథ్ ప్రభూజీ

తాళ్లపూడి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రక్కిలంక గ్రామశివారులో ఇస్కాన్ సంస్థ అవుట్‌పోస్టు నూతన ఆలయ ప్రారంభోత్సవం రాజమహేంద్రవరం ఇస్కాన్ సంస్థ, టీఎంసీ చైర్మన్ సత్యగోపీనాద్ ప్రభూజీ పర్యవేక్షణలో శ్యామాంగ శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జగన్నాథ్, బలదేవ్, సుభద్రదేవి విగ్రహాలకు అభిషేకాలు, మహాహారతి, చొప్పన్ భోగ నైవేద్యాలు సమర్పణ కార్యక్రమాలు నిర్వహించా రు. అనంతరం సత్యగోపీనాథ్ ప్రభూజీచే ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం భక్తులందరినీ ఆకట్టుకుంది. అనంతరం మహాన్న ప్రసాద వితరణ చేశారు. ప్రత్యేకంగా శ్రీల ప్రభుపాదస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మండలంలోని పలు గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా హరేకృష్ణ హరేరామ గీతాలతో అలరించింది. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ సభ్యులు బంగారం, గన్రే సురేష్, గోపాలకృష్ణ తదితర భక్త బృందం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతర్జాల సదస్సు



నిడదవోలులో జాతీయ అంతర్జాల సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

నిడదవోలు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్, తెలుగు, హిందీ భాషాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళ, బుధవారాలు జాతీయ అంతర్జాల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భారతీయ జ్ఞానవ్యవస్థ వేదాల నుంచి కృత్రిమ మేధస్సు వరకు అనే అంశంపై సదస్సులో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. భారతీయ జ్ఞాన వ్యవస్థ మూలాలను విద్యార్థులకు అందించడం ద్వారా ఈతరం యువతలో మనదేశ వేద విజ్ఞానంపై కొత్త ఆవిష్కరణలకు నాంది పలకగలదని వక్తలు పేర్కొన్నారు. ఈ సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.మాధవి, డాక్టర్ సుంకర గోపాలయ్య, డాక్టర్ నూజెళ్ల శ్రీనివాస్, డాక్టర్ హరిరామప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి తదితరు లు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన రాజమహేంద్రి

● సుబ్రహ్మణ్య మైదానంలో సీపీఐ జిల్లా 26వ మహాసభలు ప్రారంభం

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎర్ర జెండాలతో కామ్రేడ్‌లు కదం తొక్కారు. సీపీఐ జిల్లా 26వ మహాసభలు రాజమహేంద్రవరం సుబ్రహ్మణ్య మైదానంలో ఏర్పాటు చేసిన చిట్టూరి ప్రభాకరచౌదరి వేదికలో జరిగిన ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ముఖ్యవక్తలుగా విచ్చేశారు. తొలుత సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి కళాకారులతో నృత్యప్రదర్శనలు, జానపద గేయాలతో భారీస్థాయిలో కార్యకర్తలు స్థానిక చర్చిగేటు నుంచి ప్రదర్శనగా బయలుదేరి దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా సుబ్రహ్మణ్య మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగినసభలో రామకృష్ణ, అక్కినేని వనజ మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అసమర్థపాలన సాగిస్తున్నారని, అన్నివర్గాల ప్రజలు ఏడాదికాలంలో నష్టపోయారని ధ్వజ మెత్తారు. ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నిరంతరం పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తొలిరోజు జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కొండ్రపు రాంబాబు, రేఖా భాస్కరరావు, కాకినాడ, కోనసీమ జిల్లాల కార్యదర్శులు కామిరెడ్డి గోడకొండ, దేవా రాజేంద్రప్రసాద్, తోకలప్రసాద్, వి.కొండలరావు,చప్పారమణ,పి.లావణ్య, తదితరు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు నిడదవోలు విద్యార్థుల ఎంపిక



పురుషోత్తపల్లిలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిడదవోలు, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): నిడదవో లు మండలం పురుషోత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సౌత్ జోన్ స్టేట్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెఎస్‌ఆర్ ఆంజనేయులు అన్నారు. బుధవారం నిడదవోలు మండలం పురుషోత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సౌత్‌జోన్ స్టేట్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు బాపట్లలో జరిగే సౌత్‌జోన్ స్టేట్‌మీట్ అథ్లెటిక్ పోటీలకు డి.వెంకటరమణ, ఏడీబీ కార్తీక్, ఎన్.రాజు ఎంపికయ్యారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.తారకరామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ముర్రుపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోంది

● మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ముర్రుపాలు పట్టించడం వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు పట్టణంలోని 2,3,4 వార్డులలో బుధవారం ఐసీడీఎస్ పీవో కె.నాగలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను తెలియజేసే విధంగా ప్లకార్డులు ధరించి ర్యాలీ నిర్వహించారు. చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మా ట్లాడుతూ ముర్రుపాలు పట్టించడం వలన బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరిగి వ్యాధుల భారి నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. ఐసీడీఎస్ పీవో కె.నాగలక్ష్మి మాట్లాడుతూ బిడ్డకు 6నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. సూపర్‌వైజర్ ఆర్.విజయలక్ష్మి మాట్లాడుతూ బిడ్డకు పాలు ఇచ్చే పొజిషన్ తల్లులకు అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం బుజ్జి మాట్లాడుతూ డెలివరీకి ముందు చనుపాలను శుభ్రం చేసుకునే విధానాలను, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

చాగల్లు: తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అనూష అన్నారు. బుధవారం మండలంలోని ఎస్.ముప్పవరంలో తల్లిపాలు వారోత్సవాలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారంను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అనిత, చంద్రకళ, ఏఎన్‌ఎం బేబి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: దమ్మెన్ను, వెలగదుర్రు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు బుధవారం నిర్వహించారు. తల్లిపాలు వలన కలిగే ప్రయోజనాలు, ఆరోగ్య విషయాలు గురించి వైద్య సిబ్బంది వివరించారు. గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులకు గుడ్లు, పాలు, బాలామృతం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో దమ్మెన్ను సర్పంచ్ జి.సత్యనారాయణ, వెలగదుర్రు మాజీ సర్పంచ్ ఎం.రవీంద్రరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు, ఆయాలు పాల్గొన్నారు.

దళితులకే రక్షణ లేదు

● మాజీ మంత్రి వనిత



మాట్లాడుతున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దళితులకే రక్షణ లేకుండా పోతుందని మాజీ హోంమంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం వైసీపీ మండలాధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటివద్ద ఏరాటుచేసిన విలేఖర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దూబచర్లలో చిరువ్యాపారి ఆత్మహత్యకు టీడీపీ నాయకులు, కార్యదర్శి ఆశ అలేఖ్య బాధ్యత వహించి పెద్దిరాజు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుల వత్తిడివల్లే కార్యదర్శి ఆలేఖ్య పోలీసుల సహాయంతో దుకాణం తొలగించే కుట్ర చేయగా దశాబ్దాలుగా దుకాణాన్ని నమ్ముకున్న పెద్దిరాజు జీవనాధారం పోతుందని మనస్తాపంతో పురుగుల మందు తాగినట్లు చెప్పారు. ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. మహిళా మండలాధ్యక్షులు వై.లక్ష్మి, బంకా అప్పారావు అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

గోదావరి లంకలో గేదెల కాపరి అదృశ్యం

● గాలింపు చేపట్టిన కుటుంబ సభ్యులు
● ఇసుక ర్యాంపు వద్ద షర్ట్, సెల్‌ఫోన్ లభ్యం

కొవ్వూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గేదెలను లంకలో మేత కు తోలుకువెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ నెల 4వతేదీన మండలంలోని కుమారదేవం గ్రామానికి చెందిన ఇంటి అప్పా రావు(49) గేదెలను మేత కోసం గోదావరి మధ్య లంకలలోకి తోలుకెళ్లాడు, సాయంత్రం గేదెలు తిరిగివచ్చాయి. అప్పారావు రాకపోవడంతో కుటుం బ సభ్యులు వెతికారు. గ్రామంలోని ఇసుకర్యాంపు వద్ద తలపాగా, సెల్‌ఫోను, షర్ట్ దొరకడంతో గోదావరిలో గల్లంతై ఉండవచ్చునని కుటుంబ సభ్యులు రెండురోజులుగా నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో అప్పారావు కుమారుడు ఇంటి అనంత సత్యనారాయణమూర్తి రూరల్ పోలీసుకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కాలు విరిగిన ఎద్దుకు సిమెంటు కట్టు



కాలు విరిగిన ఎద్దుకు సిమెంటు కట్టు వేస్తున్న దృశ్యం

చాగల్లు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం ఔరంగాబాద్‌కు చెందిన అనపర్తి శ్రీకాంత్‌కు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు జారి పడటంతో వెనకాలకాలు విరిగిపోయింది. కాలు ఎముక రెండుగా విరిగిపోవడం నడవలేని స్థితిలో ఉన్న ఎద్దును వ్యానుపై ఎక్కించుకుని చాగల్లు పశువుల ఆసుపత్రికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆసుపత్రి వెటర్నరీ వైద్యుడు యు.ముఖేష్ ఆధ్వర్యంలో రైతుల సహాయంతో పాస్టర్ ఆఫ్ పారిస్ సిమెంట్ కట్టును ఇనుపరాడ్‌లు బయట సహాయంగా అమర్చి కట్టు వేశారు. సుమారు మూడు గంటలు కష్టపడి విజయవంతంగా కట్టువేశారు. ఎద్దుకు బలం కోసం సెలైన్‌లను ఎక్కించారు. దీంతో ఎద్దు యజమాని సహాయంగా వచ్చిన రైతులు స్థానికులు డాక్టర్ ముఖేష్‌కు అభినందనలు తెలిపి సంతోషం వ్యక్తం చేశారు.

సుపరిపాలనలో తొలిఅడుగు సభను విజయవంతం చేయాలి

● టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి



గోపాలపురంలో విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము, తదితరులు

గోపాలపురం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు మండల ముగింపు సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమం మండలంలో అన్ని పంచా యతీల్లో పూర్తిచేసుకున్న సందర్భంగా ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం భాగస్వాములైన టీడీపీ, బీజేపీ జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. మండలస్థాయి నాయకులు, బూత్ కన్వీనర్‌లు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు సమన్వయం చేసుకుని గ్రామస్థాయి నుంచి కార్యకర్తలను వేలాదిగా తీసుకురావాలన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హాజరవుతారని అన్నారు. సుమారు 6వేల మందితో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జ్ కాకర్ల జగదీశ్, ఇల్లూరి రాంబాబు, పరిమి జగదీశ్, జ్యేష్ట శ్రీనివాసరావు, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొడవటి చినవెంకటేశ్వ రరావు, మద్దిపాటి రమేశ్, జ్యేష్ శ్రీధర్, సమన్వయ కమిటీ సభ్యులు వేముల నాగరాజు, పిన్నమనేని నాగేంద్ర, బొల్లంరెడ్డి చంద్రశేఖర్, గూడా హుస్సేన్, యాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'వైద్యరంగంలో ఫ్లెమింగ్ కృషి ఎనలేనిది'

కొవ్వూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ చేసిన కృషి ఎనలేనిదని కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాల (ఏబీఎన్ కళాశాల) ప్రిన్సిపాల్ డా.ఎం.రామ్మోహన్ అన్నారు. బుధవారం కళాశాల లైఫ్‌సైన్సు విభాగం ఆధ్వర్యంలో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ 144వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీఎస్సీ మైక్రోబయాలజీ మూడో సంవత్సరం విద్యార్థిని ఆర్.శైలజ, బయోటెక్నాలజీ విద్యార్థిని టి.ఎ.ఎన్.ఎ స్.ఎస్.ప్రసన్నలు యాంటీ బయోటిక్స్ ప్రాముఖ్యత, యాంటీ బయోటిక్స్ నిరోధకతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.వై.రమేష్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై దుకాణదారులకు అవగాహన

తాళ్లపూడి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలకపల్లిలో ప్లాస్టిక్ నిషేధంపై జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి శాంతామణి అవగాహన కల్పిస్తూ పర్యటించారు. ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల నిషేధంపై వివరిస్తూ పలు దుకాణాలను తనిఖీచేసి అలాంటి ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని, అధిక మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యదర్శి కామేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని దుకాణదారులకు సూచిస్తున్న డీపీవో శాంతామణి